



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 181 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ మంగళవారం 24 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-


## చంద్రబాబు అనే నేను చెబుతున్నా...

# దేశంలో పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్

- స్టీల్ ప్లాంట్‌కు ఫౌండేషన్ కాదు... స్టీల్ సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం
- దేశ ఉక్కు అవసరాలు తీర్చేలా ఏపీ అభివృద్ధి సాధిస్తోంది
- ఉత్తరాంధ్రకు ఊపు తెచ్చే ప్రాజెక్ట్... రాష్ట్రాన్ని ప్రగతి బాట పట్టించే ప్రాజెక్ట్
- రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడి... 1 లక్షకుపైగా ఉద్యోగాలు
- రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు
- AM-NS ఇండియా ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**అనకాపల్లి/పాయకరావు పేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లిలో జరిగిన శంకుస్థాపన స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే కాదని... స్టీల్ సిటీ నిర్మాణం కోసమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏపీకి రావడం చాలా మంచి పరిణామమని.. అనకాపల్లి, ఉత్తరాంధ్ర ప్రాంతంతో పాటు రాష్ట్రం ప్రగతి వైపు పరుగులు పెట్టడానికి ఈ స్టీల్ ప్లాంట్ ఉపకరిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. చంద్రబాబు నాయుడు అనే నేను చెబుతున్నా... పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్ అంటూ సీఎం ప్రకటించారు. సోమవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు శంకుస్థాపన ఘనంగా జరిగింది. కేంద్రమంత్రి హెచ్‌డి కుమార స్వామి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్ సంస్థకు చెందిన ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుపస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."20 నెలల్లోనే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటును శంకుస్థాపన చేసుకున్నాం. ఈ భారీ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షమంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఈ ప్రాజెక్టు రావడానికి కృషి చేసిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తున్నా. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం భూమిని ఇచ్చిన రైతులందరికీ ధన్యవాదాలు. రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా 17.8 మిలియన్ టన్నుల మిగతా .. 2లో..

## యుద్ధం మానవాళికి శ్రేయం కాదు

### పశ్చిమాసియా పరిస్థితులతో మనకూ సవాళ్లు : మోదీ



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవాళి ప్రయోజనాలకు యుద్ధం ఏమాత్రం శ్రేయం కాదని, అందువల్ల శాంతియుత పరిష్కారం వైపు ఆయా పక్షాలను ప్రోత్సహించేలా మనదేశం ప్రయత్నిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. "మనది ఎప్పుడూ శాంతి మార్గమే. సమస్యకు పరిష్కారం- చర్చలు, దౌత్యమే. ఉద్రిక్తతలను, పశ్చిమాసియాలో ఘర్షణను తగ్గించడం ధ్యేయంగా మనం కృషి చేస్తున్నాం" అని సోమవారం లోక్‌సభలో ఆయనొక ప్రకటన చేశారు. వాణిజ్య నౌకలపై దాడులు, హర్మూజ్ జలసంధి మీదుగా రాకపోకలకు అవాంతరం కలిగించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టంచేశారు. ఆ ప్రాంతం మీదుగా నౌకలు రావడం ఎంతో సవాల్‌గా మారినా తమ ప్రభుత్వ ప్రయత్నాలతో పెద్దగా అవాంతరం లేకుండా ఇంధనాలు సరఫరా అవుతున్నాయని చెప్పారు. సాధారణ కుటుంబాలవారు అతితక్కువ ఇబ్బందితో బయటపడేలాచేసే చర్యలన్నీ చేపట్టినట్లు తెలిపారు. చమురు, గ్యాస్ అవసరాలు తీర్చేందుకు వేర్వేరు దేశాల సరఫరాదారులతో ప్రభుత్వం సంప్రదింపులు సాగిస్తోందని చెప్పారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లోని భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ సాధ్యమైనంతమేర సాయం అందిస్తున్నామని తెలిపారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడినుంచి స్వదేశానికి చేరుకున్నారని చెప్పారు.

**ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం**

"యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయి. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ఇదివరకు 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. గత 11 ఏళ్లలో ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా కృషి చేస్తున్నాం. అన్ని విద్యుదుత్పత్తి కేంద్రాల్లో బొగ్గు నిల్వలు సరిపడా ఉన్నాయి. ఆహారభద్రత పరంగానూ సన్నద్ధతతో మిగతా .. 2లో..

## ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో ఏ1గా కేటీఆర్

### ఏ2గా ఐఏఎస్ అధికారి అర్విందకుమార్ ఛార్జిషీట్ దాఖలు చేసిన ఏసీబీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో దుమారం రేపిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఏ1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్విందకుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్. రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా యూకేకు చెందిన ఎఫ్ఈవో (ఫార్ములా-ఈ ఆపరేషన్స్) సంస్థను పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.55 కోట్లను విదేశీ సంస్థలకు నేరుగా మళ్లించినట్లు అభియోగపత్రంలో పేర్కొన్నారు. ఫార్ములా ఈ-ఆపరేషన్స్ సంస్థతో మిగతా .. 2లో..

## వెనక్కి వెళ్లిన పరిశ్రమలు.. వెతుక్కుంటూ వస్తున్నాయ్



### ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి పెట్టుబడులు, పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోతే.. ఇప్పుడు రాష్ట్రాన్ని అవే వెతుక్కుంటూ వస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో మన రాష్ట్రానికి వస్తున్నవే అధికమని, చంద్రబాబు వంటి దార్శనిక నేత సీఎంగా ఉండడం వల్లే ఇది సాధ్యమవుతోందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రం బలంగా ఉండాలంటే పెట్టుబడులు రావాలి. వాటిని ఆకర్షించే నేత కావాలి. నాకు ఆ అనుభవం లేదు. లక్ష మందికి ఉపాధి కల్పించే పెట్టుబడులు వస్తున్నాయంటే పెట్టుబడిదారులను ఒప్పించాలి. వారిని ఒప్పించి తీసుకురావాలంటే విలక్షణమైన నేత సీఎంగా ఉండాలి. అటువంటి దురంధరుడు చంద్రబాబు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ఎప్పుడు కలిసినా ఏపీ పెట్టుబడులను బాగా ఆకర్షిస్తోంది, అనుభవం కలిగిన నేత ఉండడమే మీకు కలిసొస్తుందంటారు. ఎన్నికల ముందు అలాంటి నేత ఉండాలని కోరుకున్నా' అని పవన్ కల్యాణ్ చెప్పారు.

**పెట్టుబడిదారులకు స్ఫూర్తి**

'ఈ ఉక్కు పరిశ్రమ చాలా మంది పెట్టుబడిదారులకు స్ఫూర్తిగా నిలుస్తుంది. 18 నెలల్లో మిగతా .. 2లో..

## వెంకటరెడ్డి ఆశయ సాధనే చంద్రబాబు లక్ష్యం

### రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత - బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం బీసీ రక్షణ చట్టానికి త్వరలో తుది రూపు - రాజమండ్రిలో ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి రాష్ట్ర స్థాయి జయంతి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాల సాధనే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, ఆర్థిక బలహీన వర్గాల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవాలు శ్లాఘనీయమని, ఆయన జయంతి రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించడం ఆనందకమన్నారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని సోమవారం రాష్ట్ర పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి కష్టపడి ఎదిగి, ప్రజల సమస్యలను తనవిగా భావించి సేవలందించిన మిగతా .. 2లో..

## రూ.80 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సచివాలయ ఉద్యోగి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖలో అక్కయ్యపాలెం సచివాలయం 125 లలితా నగర్ సచివాయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 80వేలు లంచం తీసుకుంటూ ఉండగా వార్డు ఎడ్యుకేషన్ కం డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పైలా రాజేష్‌ను సచివాలయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లలితా నగర్‌లో నివాసం ఉంటున్న ద్వారాపురెడ్డి గంగ రాజ్యం అతని కుమారుడు గణేష్‌కి రాసిన స్థిరాస్తి సెటిల్ మెంట్ డీడ్ ప్రాసెస్ చేయడానికి 90వేలు లంచం డిమాండ్ చేయగా 80వేలకు ఒప్పందం కుదిరింది.. లంచం ఇవ్వడం ఇష్టం లేని గణేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.. దీనితో రాజేష్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని, కోర్ట్ లో హాజరు పరచనున్నారు.. ఈ దాడుల్లో డిఎస్పిలు రమణ మూర్తి, మిగతా .. 2లో..

## విజయమ్మ లేఖకు.. జవాబు చెప్పే దమ్ము జగన్‌కు లేదు

- అందుకే వైకాపా సైతాన్ సైన్యంతో మొరిగిస్తున్నారు
- వివేకాకు గుండెపోటు కట్టు కథ.. అవినాష్ సృష్టి
- ఆ హత్యపై మాట్లాడితే.. ఆస్తుల గురించి అని దుష్ప్రచారం చేస్తున్నారు
- జగన్‌పై పీసీసీ చీఫ్ షర్మిల ధ్వజం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'విజయమ్మ లేఖకు జవాబు చెప్పే దమ్ము జగన్‌కు లేదు. అందుకే ఆ లేఖ అబద్ధమంటూ వైకాపా సైతాన్ సైన్యం చేత మొరిగిస్తున్నారు. లేఖ మీద ఆమె సంతకం పెట్టలేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ లేఖ అబద్ధమైతే సాక్షి రిపోర్టర్‌ను పంపి అమ్మతో బైట్ తీసుకోవచ్చు. అలా చేయలేదంటే లేఖ నిజమే కదా? జగన్ విశ్వసనీయత కోల్పోయారు. సాక్షిలో సత్యమేవ జయతే అంటూ వైఎస్సార్ ఫొటో పెట్టి మరీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు' అని ఏపీసీసీ చీఫ్ షర్మిల ధ్వజమెత్తారు. తనకు జగన్‌లా స్వార్థ రాజకీయాలు తెలియవని స్పష్టంచేశారు. ఆస్తుల కోసమో.. పదవుల కోసమో చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారాల్సిన అవసరం తనకు లేదన్నారు. జగన్‌ను జైలుకు పంపేందుకు కుట్రలు పన్నినట్లు.. ఆస్తులు కావాలని ఆయనను అడిగినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వేరేవాళ్ల ఆస్తులు అనుభవించాల్సిన దుస్థితి తనకు పట్టలేదన్నారు. విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్‌ను ఉద్దేశించి ఘాటు మిగతా .. 2లో..

## రైతు రుణమాఫీ మా పరిశీలనలో లేదు

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతు రుణాలను మాఫీ చేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఆమె సోమవారం ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. అన్నదాతల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు సర్కారు అనేక చర్యలు తీసుకుందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) ద్వారా వారికి రాయితీ వడ్డీరేట్లపై రూ.3 లక్షల వరకూ రుణాలు

## ఇరాన్ విషయంలో వెనక్కి తగ్గిన ట్రంప్

### ఇరాన్ విద్యుత్తు కేంద్రాలపై దాడులకు 5 రోజుల విరామమిచ్చిన అధ్యక్షుడు 'గౌరవనీయ' ఇరాన్ నేతతో చర్చలు జరుగుతున్నాయని వెల్లడి హర్మూజ్ మూసివేత హెచ్చరికతోనే ట్రంప్ దిగొచ్చారని స్పష్టీకరణ



**దుబాయ్, విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్‌ను తెరవకపోతే ఇరాన్‌లోని విద్యుత్తు కేంద్రాలపై భీకర దాడులు చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనూహ్యంగా వెనక్కి తగ్గారు. ఈ దాడులకు 5 రోజుల విరామం ప్రకటించారు. గౌరవనీయ ఇరాన్ నేతతో చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. అయితే చర్చల ప్రకటనను ఇరాన్ మిగతా .. 2లో..

## లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు

- 2029 ఎన్నికల నుంచి అమల్లోకి!
- అప్పుడు తెలంగాణలో 179, ఏపీలో 263 శాసనసభ సెగ్మెంట్లు
- దేశంలో 543 నుంచి 816కి లోక్‌సభ స్థానాలు
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు
- ఎన్డీయే భాగస్వాములకు చెప్పిన అమిత్‌షా
- ముందుగానే మహిళా రిజర్వేషన్ కోటా



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50% పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీని ప్రకారం పార్లమెంటు స్థానాలు 543 నుంచి 816కి చేరుతాయి. 4,123 ఉన్న అసెంబ్లీ స్థానాలు 6,185 అవుతాయి. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాలు 263కి చేరుతాయి. లోక్‌సభ స్థానాలు ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి చేరే అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సోమవారం సాయంత్రం ఎన్డీయే సమావేశంలో భాగస్వామ్య పక్షాలకు కేంద్రం చెప్పింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## యుద్ధం మానవాళికి శ్రేయం కాదు

ఉన్నాం. మన రైతులు ధాన్యాగారాలన్నీ ఇప్పటికే నింపేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ నౌకలు సురక్షితంగా తిరిగేలా చూసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటిమంది భారతీయులు ఉంటున్నందువల్ల పశ్చిమాసియా మనకెంతో ముఖ్యమైనది. అందువల్ల ప్రస్తుత ఘర్షణ ఆందోళనకరమే. పార్లమెంటు ద్వారా మన ఏకాభిప్రాయాన్ని ప్రపంచానికి చేర్చాల్సిన ఆవశ్యకత ఉంది" అని మోదీ తెలిపారు.

**డైలాగులే తప్ప కొత్త అంశాల్లేవు: ప్రియాంక**

పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పే చర్చలకు మన దేశం నేతృత్వం వహించాలని కాంగ్రెస్ సూచించింది. దేశంలో ఎల్పీజీ కొరత, ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు ఏం చేస్తున్నారో ప్రధాని ఇప్పటికే చెప్పి ఉండాల్సిందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ పార్లమెంటు వెలుపల విలేకరులతో అన్నారు. ఆయన ప్రకటనలో డైలాగులే తప్ప కొత్త అంశాలేమీ లేవని చెప్పారు. 14 రోజుల మౌనం తర్వాత ప్రధానికి ఇప్పటికి తీరిక దొరికినట్లుందని లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ విమర్శించారు.

## ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో ఏ1గా కేటీఆర్

ఒప్పందం చేసుకున్న ఏస్ నెక్స్‌జెన్ సంస్థకు బాధ్యతలు అప్పగించడం, దానికి ప్రతిఫలంగా ఆ సంస్థ నుంచి భారాసకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.45 కోట్ల రావడం... క్విడ్ ప్రోకోలో భాగమేనని పొందుపరచినట్లు తెలుస్తోంది. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గతేడాది నవంబరులో అప్పటి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అనుమతిచ్చిన విషయం తెలిసిందే. కాగా... ఫార్ములా ఈ-కార్ రేసుకు సంబంధించి 2024 డిసెంబరు 18న ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ సైతం మరో కేసు నమోదు చేసింది. ఈ మేరకు అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డి, కేటీఆర్‌లను ఏసీబీ, ఈడీ అధికారులు విచారించారు. ఛార్జిషీట్‌లో కేటీఆర్ తదితరులు నిధుల దుర్వినియోగానికి, మోసానికి పాల్పడ్డారని, నేరపూరిత కుట్రలో భాగస్వామి అయ్యారని, ఇతరులకు లాభం కలిగించేలా ప్రవర్తించారని ఏసీబీ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.

**ఇదీ కేసు నేపథ్యం...**

భారాస ప్రభుత్వ హయాంలో 2023 ఫిబ్రవరిలో హుస్సేన్‌సాగర్ వద్ద ఫార్ములా-ఈ కార్ రేస్ నిర్వహించారు. దీని నిర్వహణకు బ్రిటన్‌కు చెందిన ఎఫ్ఈవో (ఫార్ములా-ఈ ఆపరేషన్స్), హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో అనుబంధ కంపెనీ ఏస్ నెక్స్‌జెన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఎంఏయూడీ)ల మధ్య 2022 అక్టోబరు 25న త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ మేరకు హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో సీజన్ 9, 10, 11, 12 రేసుల నిర్వహణ కోసం ట్రాక్ నిర్మాణం సహా ఇతర మౌలిక సదుపాయాలను ఎంఏయూడీ కల్పించాలి. 2023 ఫిబ్రవరి 11న సీజన్ 9 నిర్వహించారు. వివిధ కారణాలతో ఏస్ నెక్స్‌జెన్, ఎఫ్ఈవో సంస్థల మధ్య విభేదాలు తలెత్తాయి. తమకు డబ్బులు చెల్లించకపోవడంతో కార్ రేస్ నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఈవో సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. దీంతో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో అర్వింద్‌కుమార్ నేతృత్వంలో ఎఫ్ఈవో, ఎంఏయూడీల మధ్య 2023 అక్టోబరులో మరో కొత్త ఒప్పందం జరిగింది. ఈ-కార్ రేసు నిర్వహణకు స్పాన్సర్ ఫీజు, పన్నులు కలిపి మొత్తం రూ.110 కోట్లు చెల్లించాలని అగ్రిమెంట్‌లో పేర్కొన్నారు. మున్సిపల్ సేవలు, సివిల్ వర్క్స్ కోసం మరో రూ.50 కోట్లు ఖర్చు చేసేలా అండర్ టేకింగ్ తీసుకున్నారు. ఇలా హెచ్ఎండీఏ బోర్డుకు సంబంధించిన నిధుల నుంచి రూ.160 కోట్లు మంజూరు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో సీజన్ 10 నిర్వహణ కోసం 2023 అక్టోబరు 3, 11 తేదీల్లో హెచ్ఎండీఏ బోర్డు సాధారణ నిధుల నుంచి ఎఫ్ఈవోకు రూ.45,71,60,625 విదేశీ కరెన్సీ రూపంలో బదిలీ చేశారు. ఇది ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందంటూ ఐటీ శాఖ హెచ్ఎండీఏకు రూ.8.07 కోట్ల జరిమానా విధించింది. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏసీబీ కేసు నమోదు చేసింది. ప్రాథమిక విచారణ తర్వాత హెచ్ఎండీఏ బోర్డు... ఖజానా నుంచి మొత్తంగా రూ.54,88,87,043 దుర్వినియోగమైనట్లు తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. మొత్తం పది మందిపై కేసులు నమోదయ్యాయి. దర్యాప్తులో భాగంగా ఏసీబీ అధికారులు కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డిలను రెండుసార్లు ప్రశ్నించారు. ఫార్ములా-ఈ ఆపరేషన్స్ ప్రతినిధులను సైతం ఆన్‌లైన్‌లో విచారించారు.

**నాటకీయ పరిణామాలు**

ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. రేసు నిర్వహణ సంస్థ విదేశాల్లో ఉండటం, ఆ సంస్థ ప్రతినిధులను విచారించకుండా కేసు దర్యాప్తు ముగించడం సాధ్యం కాదు. ఏసీబీకి విచారించే అధికారం లేకపోవడంతో ఆన్‌లైన్‌లో విచారించి ఆ వివరాలను ఛార్జిషీట్‌లో పేర్కొంది. దీంతోపాటు అర్వింద్‌కుమార్ ఐఏఎస్ అధికారి కావడంతో ప్రాసిక్యూట్ చేయడానికి డీవోపీటీ అనుమతి కోసం చాలాకాలం వేచి చూడాల్సి వచ్చింది. ఇక ప్రజాప్రతినిధిగా ఉన్న కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి కోసం మరికొంత కాలం వేచి చూడాల్సి వచ్చింది. మొత్తానికి అనేక మలుపుల తర్వాత ఛార్జిషీట్ దాఖలు చేయడంతో దర్యాప్తు ముగిసింది.

## ఏసీబీకి చిక్కిన సచివాలయ ఉద్యోగి

హర్షిత, సిఐలు శ్రీనివాస్, వెంకట రావు సిబ్బంది పాల్గొన్నారు.. 1064 టోల్ ఫ్రీ ద్వారా ఏసీబీ నీ సంప్రదించ వచ్చు అని అధికారులు తెలిపారు.

## వెతుక్కుంటూ వస్తున్నాయ్

సాకారమైన ఈ పరిశ్రమ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు నిదర్శనం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేగంగా అనుమతులు ఇవ్వడంపై దృష్టి సారించాం. పారిశ్రామిక అనుకూల విధానాలు తెచ్చి, పెట్టుబడులను ఆకర్షించాం. శాంతిభద్రతలను కాపాడుతున్నాం. అందుకే గూగుల్ డేటా సెంటర్ వంటి ఐటీ సంస్థలు విశాఖను వెతుక్కుంటూ వచ్చాయి. ఇది కూటమి ప్రభుత్వం మీద వారికున్న విశ్వాసం.

**తక్కువ కాలుష్యం ఉండేలా ఏర్పాటు**

ఉత్తరాంధ్రలో దేశంలోనే అతి పెద్ద పర్యావరణ హితమైన అత్యాధునిక స్టీల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న లక్ష్మీనివాస్ మిత్తల్‌కు ధన్యవాదాలు. ఆయన చాలా స్ఫూర్తిదాయక పారిశ్రామికవేత్త. తక్కువ కాలుష్యం ఉండేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణశాఖ మంత్రిగా దీన్ని హర్షిస్తున్నా. 2014-19 మధ్య రాయలసీమకు కియా రాగానే అక్కడి పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఉక్కు పరిశ్రమతో ఈ ప్రాంత దశ మారిపోనుంది' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## వెంకటరెడ్డి ఆశయ సాధనే చంద్రబాబు లక్ష్యం

మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని కొనియాడారు. గ్రామీణాభివృద్ధి, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో నడిచి ప్రజాసేవ చేయాలని పిలుపునిచ్చారు.

**త్వరలో బీసీల రక్షణ చట్టం అమలు**

రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల పక్షపాతి అని మంత్రి తెలిపారు. బీసీ సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నామని, అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. బీసీ రక్షణ చట్టానికి తుది ముసాయిదా సిద్ధం చేశామని,త్వరలోనే ఈ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇప్పటికే రాజీవ్ రంజన్ మిశ్రా కమిటీని నియమించామన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ అందజేయనున్నామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలే కల్పనే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ ఉగాది జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. ఇలా అన్ని రంగాల్లో బీసీలు ముందంజ వేయాలన్నదే సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విస్తృత అవకాశాలు కల్పిస్తూ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తోందన్నారు. శెట్టిబలిజ జాతి గౌరవాన్ని కాపాడిన యోధుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు కూడిపూడి సత్తిబాబు, వీరంకి వెంకట గురుమూర్తి, ఎం.ఈశ్వరరావు, డైరెక్టర్లు జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో శెట్టి బలిజ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

## దమ్ము జగన్‌కు లేదు

వ్యాఖ్యలు చేశారు.

**అబద్ధమైతే విజయమ్మే స్పష్టత ఇచ్చేవారు**

'విజయమ్మ వైఎస్సార్ భార్య. ఆయనలో సగం. లేఖ ద్వారా తన ఆవేదన వ్యక్తంచేశారు. నలుగురు మనవలకూ సమానంగా ఆస్తులు పంచాలని చెప్పారు. అది వైఎస్సార్ ఆదేశం అనీ లేఖలో పేర్కొన్నారు. రాసింది దేవుడి సాక్షిగా అని కూడా ప్రస్తావించారు. ఆస్తుల విషయంలో గోబెల్స్ ప్రచారం చేయొద్దని చెప్పారు. ఈ విషయం వైకాపాలో సంస్కారం ఉన్నవాళ్లకు అర్థమవుతుంది. లేఖ నిజం కాకపోతే.. విజయమ్మ స్పష్టత ఇచ్చేవారు. అయినా వైకాపా వారు మాట్లాడుతున్నారంటే కుక్కలు మొరుగుతున్నాయని అనుకుంటాను' అని దుయ్యబట్టారు.

**పేదల పథకాన్ని ఆనవాళ్లు లేకుండా చేశారు**

'పేదలకు లబ్ధిని చేకూర్చే ఉపాధిహామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఆనవాళ్లు లేకుండా చేసింది. 100 రోజుల పనిలేదు. పనులు చేసినా.. చెల్లింపుల్లేవు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 100 నియోజకవర్గాల్లో పరిరక్షణ యాత్ర చేశాను. పథకాన్ని ఎలా నీరుగార్చారనే విషయం ప్రజలతో మాట్లాడుతుంటే తెలిసింది' అని షర్మిల చెప్పారు.

**వివేకా హత్యలో నిజమేమిటో జగన్, భారతి చెప్పాలి**

'వివేకా హత్యను అవినాష్‌రెడ్డి తప్పుదారి పట్టించారు. గుండెపోటు కట్టు కథ అవినాష్ సృష్టే. హత్యను సునీత మీదకు నెట్టాలని చూశారు. నేను విశాఖపట్నం ప్రెస్‌మీట్‌లో చెప్పింది ఈ నిజాన్నే. నేను హత్య అంటే.. వైకాపా ఆస్తులు అంటోంది. వివేకా హత్యపై సమాధానం చెప్పే దమ్ము వైకాపాకు లేదు. ఆరోజు ఉదయం నుంచి సాక్షి ఛానల్‌లో గుండెపోటు అని ఎందుకు ప్రసారం చేశారో ఇప్పటికీ సమాధానం చెప్పలేదు. వివేకా హత్య గురించి జగన్, భారతి నిజమేంటో చెప్పాలి. వాళ్లు చెప్పలేక నాపై నిందలు వేస్తున్నారు. నేను, సునీత.. చంద్రబాబుతో చేతులు కలిపామని వదంతి సృష్టించారు. ఆస్తుల కోసం తల్లి మీద కేసులు పెట్టి కోర్టుకు వెళ్లింది నేను కాదు. ఎంవోయూను నేను బయటపెట్టలేదు. రాజకీయ లబ్ధి కోసం భాజపాకు దత్తపుత్రుడిగా మారి.. ప్రత్యేక హోదాను, పోలవరాన్ని, రాష్ట్ర ప్రయోజనాలను జగన్ తాకట్టుపెట్టారు' అని మండిపడ్డారు.

## 50% పెంపు

మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ల నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. కాంగ్రెసేతర విపక్షాలతోనూ విడిగా భేటీ నిర్వహించారు. కాంగ్రెస్‌తోనూ షా మాట్లాడే అవకాశం ఉంది. నియోజకవర్గాల సంఖ్య పెంచడానికి వీలుగా ముందుగా మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లులు తీసుకురాబోతున్నట్లు తెలిసింది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం.

**ప్రాథమిక జనాభా లెక్కల వివరాలతోనే..**

2023 సెప్టెంబరులో ఆమోదించిన బిల్లు ప్రకారం 2034 నుంచి మహిళలకు 33% రిజర్వేషన్లు అమల్లోకి రావాలి. రాజ్యాంగ అధికరణలు 170(3), 81(3) ప్రకారం.. 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల ఆధారంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిబంధన ఉంది. అందువల్ల కేంద్రం మహిళా రిజర్వేషన్ల అమలును 2034 నుంచి అమల్లోకి తేనుంది ఇదివరకు భావించారు. ఇప్పుడు జనగణన 2027 మార్చి 1కల్లా పూర్తికానుండటంతో ప్రాథమిక జనాభా లెక్కల వివరాలు ప్రకటించి.. ఆ వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేపటొచ్చు. ఈ అంశంపై అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు మొదలుపెట్టింది. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది.

## రైతు రుణమాఫీ మా పరిశీలనలో లేదు

అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే.. సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద అదనపు ప్రోత్సాహకాలూ ఇస్తున్నామని చెప్పారు. రిజర్వు బ్యాంకు జారీ చేసిన ప్రాధాన్యరంగ రుణాల మార్గదర్శకాల ప్రకారం అనుబంధ కార్యకలాపాల రుణాలతో సహా పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను రూ.1.60 లక్షల నుంచి రూ.2.00 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. వ్యవసాయం సహా ఆర్థిక వ్యవస్థలోని ప్రాధాన్య రంగాలకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తగినంత రుణ ప్రవాహం ఉండేలా చూస్తున్నామని పేర్కొన్నారు. పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు నేరుగా నగదు బదిలీతో పాటు పంటల బీమా అందిస్తున్నామని వెల్లడించారు.

## ఇరాన్ విషయంలో వెనక్కి తగ్గిన ట్రంప్

తీవ్రంగా ఖండించింది. అసలు చర్చలే జరగడం లేదని స్పష్టం చేసింది. హర్మూజ్‌ను పూర్తిగా మూసివేస్తామని హెచ్చరించడంతోనే ఆయన దిగివచ్చారని పేర్కొంది. ఆర్థిక, చమురు మార్కెట్ల స్థిరీకరణ కోసం జరుగుతున్న ప్రయత్నమిదని వ్యాఖ్యానించింది. యుద్ధం నేపథ్యంలో సోమవారమూ స్టాక్ మార్కెట్లు అల్లకల్లోలమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1800 పాయింట్లకుపైగా పతనమైంది.

**పరస్పర విరుద్ధ ప్రకటనలు**

'సుహృద్భావ వాతావరణంలో ఇరాన్‌తో ఫలవంతమైన చర్చలు జరిగాయి. అవి సంపూర్ణ పరిష్కారం దిశగా సాగాయి. ఈ వారమంతా చర్చలు జరుగుతాయి. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలు, చర్చల ఫలితంగానే విద్యుత్తు ప్లాంట్లపై దాడులను నిలిపివేస్తున్నాం' అని తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ప్రకటించారు. అయితే చర్చల వివరాలను, ఎక్కడ జరుగుతుందీ ఆయన వెల్లడించలేదు. ట్రంప్ ఈ ప్రకటన చేసిన వెంటనే ఇరాన్ అధికార టీవీ ఛానల్ ఒక ప్రకటనను చదివి వినిపించింది. 'ఇరాన్ గట్టి హెచ్చరికలతో అమెరికా అధ్యక్షుడు వెనక్కి తగ్గారు' అని ప్రకటించింది. మరోవైపు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌కు(ఐఆర్‌జీసీ) సన్నిహితంగా ఉండే రెండు వార్తా సంస్థలు.. అమెరికాతో చర్చలేవీ జరగలేదని స్పష్టంచేశాయి. సోమవారం ఉదయం మాత్రం.. ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. తాను తుర్కియే విదేశాంగ మంత్రి హకన్ ఫిదాతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. గతంలో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిగా తుర్కియే వ్యవహరించింది. రష్యా విదేశాంగ మంత్రితోనూ అబ్బాస్ చర్చలు జరిపారు. అమెరికాతో చర్చలు జరుగుతున్నాయన్న వార్తలను ఇరాన్ విదేశాంగశాఖ ఖండించింది. ఆర్థిక, చమురు మార్కెట్లను తారుమారు చేయడానికి, అమెరికా, ఇజ్రాయెల్ చిక్కుకున్న చిక్కుముడుల నుంచి బయటపడటానికి ఫేక్ వార్తలను ప్రచారం చేస్తున్నారని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘెర్ ఖలీబా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఖలీబాతో సమావేశం ఏర్పాటు చేయాలని అమెరికా కోరినట్లు ఇరాన్ అధికారి ఒకరు తెలిపారు. అయితే దీనిపై సుప్రీం నేషనల్ కౌన్సిల్ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని వివరించారు. దీనినిబట్టి ట్రంప్ పేర్కొన్న గౌరవనీయ నేత ఖలీబానేనని స్పష్టమవుతోంది.

**అసలేం జరిగింది?**

తమ విద్యుత్తు కేంద్రాలను పేల్చేస్తామని ట్రంప్ ప్రకటించిన తర్వాత సోమవారం ఉదయం ఇరాన్ ప్రతిస్పందించింది. పశ్చిమాసియాలోని విద్యుత్తు కేంద్రాలపై తాము దాడులు చేస్తామని, పర్షియన్ గల్ఫ్‌లో సీమైన్లతో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించింది. ఏయే కేంద్రాలపై దాడులు చేస్తామో ఒక జాబితాను వెల్లడించింది. అందులో యూఏఈలోని బరాకా అణు విద్యుత్తు ప్లాంటు కూడా ఉంది. మరోవైపు మధ్యాహ్నానికి యూఏఈపైకి ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. ఈ సమయంలోనే ట్రంప్ ప్రకటన వెలువడింది. 'అమెరికా, ఇరాన్‌లు గత రెండు రోజులుగా సుహృద్భావ, ఫలవంత చర్చలు జరిపాయి. పశ్చిమాసియాలో ఘర్షణలకు పూర్తి పరిష్కారం దిశగా ఇవి సాగాయి. ఈ లోతైన, వివరణాత్మక, నిర్మాణాత్మక సంభాషణల ఆధారంగా ఇరాన్‌లోని అన్ని విద్యుత్తు కేంద్రాలపై, ఇంధన క్షేత్రాలపై దాడులను 5 రోజులపాటు ఆపాలని నేను మా విభాగాలను ఆదేశించా. ఈ చర్చలు ఈ వారమంతా కొనసాగుతాయి' అని ట్రంప్ వివరించారు.

**ఒప్పందాన్ని ఇరాన్ కోరుకుంటోంది: ట్రంప్**

ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్.. చర్చలపై మరిన్ని వివరాలందించారు. 'ఇరాన్ ఒప్పందాన్ని కోరుకుంటోంది. పశ్చిమాసియా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, నా అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు.. ఆదివారం సాయంత్రం ఇరాన్ 'గౌరవనీయ' నేతతో చర్చలు జరిపారు. ఇవి సోమవారమూ కొనసాగాయి' అని తెలిపారు. 5 రోజుల్లోగానీ అంతకుముందేగానీ ఇవి కొలిక్కి రావొచ్చని వివరించారు. అయితే ఆ ఇరాన్ నేత ఎవరో ట్రంప్ వెల్లడించలేదు. మొజ్తాబా ఖమేనీతో మాత్రం కాదని స్పష్టంచేశారు. ఇరాన్‌తో ఒప్పందం కుదిరితే.. శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ నుంచి అమెరికా తరలిస్తుందని తెలిపారు. అణు బాంబు తయారీని ఆపేయడానికి ఇరాన్ అంగీకరించిందని వెల్లడించారు. వాషింగ్టన్‌కు బయలుదేరే ముందు మరోసారి ట్రంప్ మీడియాతో మాట్లాడారు. హర్మూజ్ అతిత్వరలో తెరుచుకుంటుందని, అమెరికా, ఇరాన్ సంయుక్తంగా దానిని నియంత్రిస్తాయని తెలిపారు. 'నేను, ఆయతుల్లా కలిసి ఆ పని చేస్తాం. అది ఏ ఆయతుల్లా అయినా కావొచ్చు. మేం డీల్ చేసే వ్యక్తులు హేతుబద్ధంగా, స్థిరంగా ఉన్నవారనిపిస్తోంది. వారెవరో చర్చల్లో పాల్గొంటున్న వారికి తెలుసు. అందులో మేం వెతుకుతున్న వ్యక్తీ ఉండవచ్చు. 5 రోజుల తర్వాత చర్చలు అసంపూర్తిగా ముగిస్తే మళ్లీ దాడులు చేస్తాం' అని హెచ్చరించారు.

**'మేం ఎన్నడూ వెళ్లని స్థానాలకు'**

తాము, ఇరాన్ ఎన్నడూ వెళ్లని స్థానాలకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రకటన తర్వాత ఆయన ఒక వీడియో విడుదల చేశారు. 'ఇరానియన్లు ఈ అంశాన్ని ముగించాలని కోరుకుంటున్నట్లు నేను విన్నా. అయితే అది చెడ్డ ఒప్పందంగా ఉండకూడదు' అని ఇజ్రాయెల్ విదేశీ, రక్షణ కమిటీ ఛైర్మన్ బోజ్ బిస్మత్.. నెతన్యాహుతో అన్నట్లు ఆ వీడియోలో ఉంది. 'హర్మూజ్' అల్టిమేటం గడువు ముగియడానికి ముందే ట్రంప్ దాడుల నిలిపివేత ప్రకటన చేయడంలో ఈజిప్టు, పాకిస్థాన్, తుర్కియే కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటిదాకా ఎటువంటి ఒప్పందం కుదరలేదని సమాచారం. ఛానల్ 12కు చెందిన బరాక్ రవీద్ ఈ విషయాన్ని వెల్లడించారు. అల్టిమేటం గడువు ముగియడానికి ముందే ఈ 3 దేశాలు తీవ్రంగా శ్రమించి సమయం తీసుకున్నాయని ఆయన తెలిపారు. తుర్కియే విదేశాంగ మంత్రితో ఇరాన్ విదేశాంగ మంత్రి మాట్లాడారని, ఆయా దేశాల కృషి ఫలితంగా 5 రోజుల విరామానికి ట్రంప్ అంగీకరించారని వివరించారు. ఉద్రిక్తతలను తగ్గించడంపై దృష్టి సారించాలని ఇరాన్‌కు స్పష్టమైన సందేశాలను పంపామని ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్-ఫతా ఎల్-సిసి తెలిపారు. చమురు ధరలు తగ్గడానికే ట్రంప్ సమయం తీసుకున్నారని ఇరాన్ విదేశాంగశాఖను ఉటంకిస్తూ మెహర్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. అమెరికా, ఇరాన్ మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని తెలిపింది.

## ఏపీనే బెస్ట్ ప్లేస్

ఉక్కు ఉత్పత్తి అవుతుంది. రూ.1.35 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సంస్థకు జాతీయ స్థాయిలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా చాలా మంచి పేరుంది. ఇలాంటి సంస్థ ఏపీకి రావడం చాలా మంచి పరిణామం. అందుకే చెబుతున్నాను... ఇవాళ జరిగిన శంకుస్థాపన స్టీల్ ప్లాంట్ కోసం మాత్రమే కాదు... స్టీల్ సిటీకి జరిగిన శంకుస్థాపన. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మాణం జరుగుతుంది. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్టర్ ఫర్నేస్, డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ నిర్మాణం పూర్తి చేస్తారు. అలాగే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ 4 లేన్ల రహదారి కూడా పూర్తి అవుతుంది. పరిశ్రమకు ముడి ఇనుము సరఫరా కోసం పైప్ లైన్ కూడా వేయబోతున్నారు. ఈ ప్లాంట్ కోసం పైప్ లైన్ వేయాలని ప్రధానిని కోరితే వెంటనే అంగీకరించారు. ఉక్కు ఉత్పత్తి ఒక్కటే కాదు ఆర్థిక లావాదేవీలతో విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపు రేఖలు మారతాయి" అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**అనుమతులు వేగంగా ఇస్తాం... అదే వేగంతో అభివృద్ధి చేయండి**

"ఈ పరిశ్రమకు ఇంత వేగంగా భూసేకరణ, అనుమతులను ఒక్క ఏపీలోనే ఇచ్చాం. చంద్రబాబు అను నేను చెబుతున్నాను... దేశంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతం ఆంధ్రప్రదేశ్. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, రాష్ట్రం ఉంది. నిపుణులు, మానవ వనరులు ఏపీకి మాత్రమే సొంతం. టూరిజం నుంచి డేటా సెంటర్ వరకూ, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకూ అన్నింటికీ ఏపీలో మెండైన అవకాశాలు ఉన్నాయి. కొత్త ఆలోచనలతో వచ్చి అవకాశాలను అందిపుచ్చుకోవాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే నినాదాన్ని విజయవంతం చేస్తాం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావటం దేశంలో ఇదే తొలిసారి. బీపీసీఎల్ సహా పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల్లోనే రాష్ట్రానికి 20.35 లక్షల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. విశాఖ ఎకనామిక్ రీజియన్ నాలెడ్జి ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీ సెంటర్లు ఇలా కీలకమైన కేంద్రంగా విశాఖ మారుతోంది. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి. రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా ఉత్తరాంధ్ర మారుతుంది. పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తాం. కొత్తగా పోర్టులు, ఎయిర్ పోర్టులు వస్తున్నాయి. ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తాం. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా నిర్మాణం పూర్తి చేసుకునేందుకు సహకారం ఇస్తాం. ఈ పరిశ్రమ నిర్మాణంలో రైతులు తమ భూములను త్యాగం చేశారు. వారికి సహకారం అందించాలి. ఉక్కు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు ధన్యవాదాలు. మొదటిగా అనకాపల్లి జిల్లా యువతకు ఈ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలి. ఆవిష్కరణల కోసం మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు అభినందనలు" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అభివృద్ధి చేస్తామని చెప్పాం... చేసి చూపిస్తున్నాం**

"ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే ఈ ప్రాజెక్టు సాకారమైంది. రాష్ట్రంపై ప్రధాని చూపిస్తున్న అభిమానానికి ఈ వేదిక పైనుంచి మరోసారి కృతజ్ఞతలు చెబుతున్నా. ప్రధాని మోదీ చెప్పిన జప్త్రఅజ్ శీ రాష్ట్రఅజూ తయారీ విధానానికి ఏపీ తిరుగులేని వేదిక. ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో నేడు ఈ పరిశ్రమ రాష్ట్రానికి వచ్చింది. డబుల్ ఇంజన్ సర్కార్ విజయం ఇది. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేస్తామని... నేను, పవన్ కళ్యాణ్ చెప్పాం. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలన చేసి చూపిస్తున్నాం. ఏ పని తలపెట్టినా సంపూర్ణ మద్దతు ఇస్తున్న పవన్ కళ్యాణ్‌ను అభినందిస్తున్నా. మంత్రి లోకేష్ పరిశ్రమలు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు."అని సీఎం చెప్పారు.

**నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఒప్పందం**

యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పన, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వంతో రెండు వేర్వేరు ఒప్పందాలను ఆర్సెలార్ మిట్టల్- నిప్పన్ స్టీల్ సంస్థ చేసుకున్నాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు నైపుణ్యాలు కల్పించేలా ఒక ఒప్పందం, ఆధునిక ఉత్పత్తి సామర్థ్యాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు మరో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అత్యాధునిక మెటలర్జికల్ ఇనిస్టిట్యూట్ ద్వారా యువతకు మెరుగైన నైపుణ్యం, తయారీ సామర్థ్యాలను కల్పిస్తామని ఆర్సెలార్ మిట్టల్ -నిప్పన్ స్టీల్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ ప్రకటించారు.

**ఎక్స్ పీరియన్స్ జోన్ సందర్శన**

శంకుస్థాపన కార్యక్రమానికి ముందు అదే ప్రాగంణంలో ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియన్స్ జోన్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. సీఎంతోపాటు కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎక్స్ పీరియన్స్ జోన్ ను సందర్శించారు. ాఏవీ-చీూ ఇండియా ప్లాంట్ కు సంబంధించిన వివరాలు, ఉక్కు రంగంలో ాఏవీ-చీూ ఇండియా సంస్థ ప్రగతి వంటి అంశాలపై ప్రదర్శించిన వీడియోలను తిలకించారు. దశల వారీగా ఏర్పాటు చేయబోయే స్టీల్ ప్లాంట్ మీనియేచర్ ను సీఎం, కేంద్ర మంత్రులు, డిప్యూటీ సీఎం, మంత్రులు తిలకించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ సీఎం రమేష్, అనకాపల్లి జిల్లా ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఆర్సెలార్ మిట్టర్ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఆర్సెలార్ మిట్టల్ సీఈఓ ఆదిత్య మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్రతినిధులు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## 'గ్రేటర్ సీమ'పై బాబు స్ట్రాటజీ... తమ్ముళ్లకు అర్థం కాలేదా..?

గ్రేటర్ రాయలసీమ. ఇప్పుడు కూటమిలో ఎక్కువగా వినిపిస్తున్న నినాదం ఇదే. ఈ ప్రాంతంపై పట్టు కోసం.. సీఎం చంద్రబాబు పదే పదే పార్టీనాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. గ్రేటర్ సీమలో సత్తా చాటాలని కూడా చెబుతున్నారు. దీనికి కారణం.. దాదాపు 52 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండడమే. అంతేకాదు.. వీటిలో ఒకేపార్టీ పట్టకట్టేవి కొన్ని మాత్రమే ఉండడం. ఎక్కువగా స్వింగ్ ఓటర్లు.. రెడ్డి సామాజిక వర్గం ప్రాబల్యం ఎక్కువగా ఉండడమే దీనికి కారణం.

ఇది సమగ్ర స్వరూపం..

అనంతపురం- శ్రీ సత్యసాయి (14 సీట్లు): అనంతపురం అర్బన్, ధర్మవరం, గుంతకల్, హిందూపురం, కళ్యాణదుర్గం, కదిరి, మడకశిర, పుట్టపర్తి, రాప్తాడు, రాయదుర్గం, సింగనమల, తాడిపత్రి, ఉరవకొండ.

కడప -అన్నమయ్య (10 సీట్లు): బద్వేల్, జమ్మలమడుగు, కడప, కమలాపురం, కోడూరు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట, రాయచోటి.

కర్నూలు - నంద్యాల (14 సీట్లు): ఆదోని, ఆళ్లగడ్డ, ఆలూరు, బనగానపల్లె, డోన్, కోడుమూరు, కర్నూలు, మంత్రాలయం, నందికొట్కూరు, నంద్యాల, పాణ్యం, పత్తికొండ, శ్రీశైలం, ఎమ్మిగనూరు.

చిత్తూరు - తిరుపతి (14 సీట్లు): చంద్రగిరి, చిత్తూరు, గంగాధర నెల్లూరు, కుప్పం, మదనపల్లె, నగరి, పలమనేరు, పీలేరు, పుంగనూరు, పూతలపట్టు, సత్యవేడు, శ్రీకాళహస్తి, తంబళ్లపల్లె, తిరుపతి.

వీటిలో తాడిపత్రి, రాప్తాడు, ఉరవకొండ, ఆళ్లగడ్డ, పత్తికొండ, శ్రీశైలం, కుప్పం, హిందూపురం వంటి కొన్ని నియోజకవర్గాలు మాత్రమే టీడీపీకి కలిసి వస్తున్న నియోజకవర్గాలు. అంటే.. ఎంత బలమైన పోటీ ఉన్నా.. ఇక్కడ కొంతమేరకు గెలుపు గుర్రం ఎక్కొచ్చు. మిగిలిన నియోజకవర్గాల్లో పరిస్థితులు.. ఎన్నికలకు ముందున్న హవా వంటి ప్రభావితం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం చంద్రబాబు ఇక్కడి నాయకులకు పదే పదే ..నియోజకవర్గాల్లో బలపడాలని చెబుతున్నారు. గ్రేటర్ సీమలో గత ఎన్నికల్లో కూటమి హవా కనిపించింది. పులివెందుల, పుంగనూరు, బద్వేల్ వంటి కేవలం వేళ్లపై లెక్కించే స్థాయిలోనే వైసీపీ విజయం దక్కించుకుంది. అయితే.. కూటమికి దక్కిన మెజారిటీ సీట్లు శాశ్వతమా? అనేదే ప్రశ్న. కానీ.. పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వాటిపై సీరియస్‌గా ఉండాలని చెబుతున్నారు. పైగా గ్రేటర్ సీమలో విజయం దక్కించుకుంటే.. అధికారంలోకి వచ్చేందుకు రెడ్ కార్పెట్ పడుతుందన్నది కూడా తెలిసిందే. మరి బాబు మాటలు ఎంత మంది అమలు చేస్తారన్నది చూడాలి. ప్రస్తుతం అయితే.. విని విననట్టే ఉన్నారన్నది రాజకీయ వర్గాలు చెబుతున్నమాట.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# రావులపాలెం ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకోబోతోంది

## పంచాయతీని సందర్శించిన కేరళ బృందం - రాష్ట్రంలో మొదటి పంచాయతీ

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ ముఖద్వారం రావులపాలెం గ్రామపంచాయతీ అత్యంత అరుదైన అవకాశాన్ని దక్కించుకోబోతుంది.ప్రపంచ నాణ్యతా ప్రమాణాలు(ఐఓసి) సర్టిఫికెట్ అందుకోవడానికి అతి దగ్గరలో ఉంది. ఇందుకు సంబంధించి సోమవారం కేరళ కు చెందిన ఆడిట్ బృందం ప్రేమానంద్ సిఎం,సీలం కెఎమ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ కోర్డినేటర్ ఇమామ్ లు ఈ పంచాయతీని సందర్శించారు.రాష్ట్రంలో ఐఓసీ సర్టిఫికెట్ పొందిన తొలి గ్రామ పంచాయతీగా కీర్తికెక్కబోతుంది. ఇప్పటివరకు మన రాష్ట్రంలో ఈ ఐఓసి సర్టిఫికేట్ పొందిన గ్రామ పంచాయతీలు లేవు. కేరళలో చాలా ఎక్కువగానే గ్రామ పంచాయతీలు ఐఓసీ సర్టిఫికెట్ పొందాయి. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ లు మన రాష్ట్రంలో కూడా ఐఓసీ సర్టిఫికెట్ పొందే విధంగా పంచాయతీలను తీర్చిదిద్దే ప్రయత్నం ఏడాదిన్నర క్రితం చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో 56 పంచాయతీలను ఎంపిక చేశారు. ఆ తర్వాత రోజుల్లో వడపోతల అనంతరం 24 పంచాయతీలు ఈ పోటీలో నిలబడ్డాయి. ఈ 24 పంచాయతీలలో పనిచేసే కార్యదర్శి,డిజిటల్ అసిస్టెంట్, డిప్యూటీ ఎంపీడీవోలను కేరళ తీసుకెళ్లి అక్కడ ఐఓసి సర్టిఫికెట్ పొందిన పంచాయతీలను చూపించారు. అలాగే మూడు రోజులు పాటు శిక్షణ కూడా ఇచ్చారు.ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాలో రావులపాలెంతో అల్లవరం మండలం కొమరగిరిపట్నం, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం, పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం గణపవరం గ్రామ పంచాయతీలు ఐఎస్ఓ సర్టిఫికేట్ రేసులో ఉన్నాయి. అసలు ఈ ఐఎస్ఓ సర్టిఫికేట్ పొందడానికి అర్హతలను పరిశీలిస్తే గ్రామం ఎంతో సుందరంగా ఉండాలి.చెత్తా చెదారాలు లేకుండా మెరుగైన పారిశుధ్య నిర్వహణ, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కలిగి ఉండాలి.అంతేగాక పన్నుల వసూళ్లు,గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం,వారికి జవాబుదారీగా ఉండడం వంటి ఎన్నో విషయాలను





పరిగణలోకి తీసుకుంటారు. సాధారణంగా ఇలాంటి సదుపాయాలు చిన్న, మధ్య తరహా గ్రామపంచాయతీలలో మాత్రమే సాధ్యమవుతుంది. కాని సుమారు 35 వేల జనాభా కలిగిన ఈ పంచాయతీ ఉండటం విశేషం. శరవేగంగా ఈ రావులపాలెం అభివృద్ధి చెందుతుంది.నాలులైన్ల జాతీయ రహదారి తో పాటు అనేకమందికి ఉపాధి అవకాశాలు కల్పించే కేంద్రంగా ఉండడంతో ఇక్కడ స్థిరపడటానికి అనేకమంది ఉత్సాహం చూపుతున్నారు. ప్రతి ఏటా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సదుపాయాలు కల్పించడంలో ఈ పంచాయతీ ముందుంటుంది.పంచాయతీ శాశ్వత ఆదాయం ఉండేలా షాపింగ్ కాంప్లెక్స్ లు ఇతర ఆదాయ వనరులు సమకూర్చడంలో కీలకంగా ఉంది. అలాగే ఈ గ్రామాల్లో రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేస్తారు. ప్రభుత్వం ఏదైనా ఈ గ్రామంలో నాయకులు తీరు మాత్రం మిగిలిన గ్రామాల కంటే భిన్నంగా ఉంటుంది. అభివృద్ధి విషయంలో ఎవరు ఎలాంటి పేచీలు పెట్టరు. ఒకే మాటపై నిలబడి ఊరి బాగు చేసుకోవడానికి నడుం బిగిస్తారు. అందుకునే ఇక్కడ అభివృద్ధి సాధించడానికి కారణం అయిందని చెప్పవచ్చు. ప్రస్తుతం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అంతకుముందు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిలు రావులపాలెం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపారు. కేవలం ప్రభుత్వ నిధులే గాక ఇక్కడ ఆర్థికంగా స్థితి మంతులైన దాతలు కూడా ముందుకు వచ్చి అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. ఈ గ్రామం అన్ని పరీక్షలు పాసై ఐఎస్ఓ సర్టిఫికేటు పొందడానికి కీలకమైన ఘట్టానికి చేరుకుంది. బుధవారం వచ్చిన ఈ కేరళ ఆడిట్ బృందం క్షేత్రస్థాయిలో గ్రామ పరిస్థితులను పరిశీలించింది.ముందుగా సర్పంచ్ తాడేపల్లి నాగమణి అధ్యక్షతన పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, పంచాయతీ,సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి, పంచాయతీ పాలన తదితర విషయాలను వారు పరిశీలించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జడ్పిటిసి కుడిపూడి శ్రీనివాస్ లు మాట్లాడుతూ తమ పదవీ కాలంలో ఇలాంటి ఐఓసి సర్టిఫికేట్ పొందే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ గ్రామపంచాయతీ అభివృద్ధిలో వారు ఏ విధంగా భాగస్వాములు అయ్యారు అనేది వివరించారు.ఏడాదిన్నర కాలంగా సర్టిఫికెట్ పొందడానికి కావలసిన ఏర్పాట్లు అన్ని ఎప్పటికప్పుడు చేస్తూ ఉన్నామని వివరించారు .ఇందుకు సహకరించిన గ్రామస్తులకు, పాలకవర్గానికి, దాతలకు, అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు. స్వతంత్రం రాక ముందు నుంచి కూడా ఈ పంచాయతీ రికార్డులను భద్రపరిచిన తీరును ఈ బృందం ప్రశంసించింది. అలాగే పౌర సేవల తీరును స్వర్ణ పంచాయతీ ద్వారా అందిస్తున్న సేవలను ఈ బృందం పరిశీలించింది.ఈ బృందం మరో రోజు ఈ పంచాయతీని పరిశీలిస్తారు. అనంతరం నివేదిక ప్రభుత్వానికి అందిస్తారు. వీరి నివేదిక ఆధారంగా సర్టిఫికెట్ కు ఆమోదముద్ర వేస్తారు.

జాతీయ నాయకుల సెంటర్ నామకరణంకు

# టిడిపి నాయకులు వ్యతిరేకమా..?

ఎన్టీఆర్‌ను జాతీయ నాయకుడిలా భావించాం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** నందమూరి తారక రామారావు పేరును స్మరించే అర్హత వారి నాయకుడు చంద్రబాబు నాయుడు, వేగుళ్ళ జోగేశ్వరరావులకు లేదని వైయస్సార్ ఎస్సి, బిసి ఓసి నాయకులు ఖండించారు.స్థానిక విజయలక్ష్మి నగర్లో వైఎస్సార్సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మండపేట పట్టణంలో వాణి మహల్ సెంటర్ లో మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎన్.టి.రామారావు, వంగవీటి రంగా తో కూడిన సెంటర్ ను జాతీయ నాయకుల సెంటర్ గా నామకరణం చేయడానికి తెలుగుదేశం నాయకులు ఎందుకు ఇంత ఉలిక్కిపాటు పడుతున్నారనీ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పేరును కించపరచడం లేదన్నారు. తాము జాతీయ నాయకుడిగా భావించామన్నారు. జాతీయ నాయకుల సెంటర్ నామకరణం చేయమన్నామని పేర్కొన్నారు. తమ వైయస్సార్సీపి ప్రభుత్వంలో అంబేద్కర్ ని గౌరవించుకుంటూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అని ఒక జిల్లాకే నామకరణం చేయడం జరిగిందన్నారు. మండపేట నడిబొడ్డులోకి తీసుకువచ్చిన ఘనత తమ నాయకుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కే దక్కుతుందన్నారు. తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఎన్టీ రామారావు పేరును ఒక జిల్లాకు నామకరణం చేసి గౌరవించుకున్న ఘనత తమకే చెందుతుందని గుర్తుచేశారు. నీతిమాలిన రాజకీయలు చేస్తున్నది తాము కాదనీ పేర్కొన్నారు. వేగుళ్ళ జోగేశ్వరరావు చెప్పినట్లు నడుస్తూ ఇప్పటికీ అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహాల కన్వీనర్ మందపల్లి రవికుమార్, పలివెల సుధాకర్, యాండ్ర ప్రభాకర్, పిల్లి శ్రీనివాస్, పెంకే వెంకట్రావు, జొన్నపల్లి సత్తిబాబు, ముమ్మిడివరపు బాపిరాజు, మట్టపర్తి గోవిందరాజు, యర్రగుంట అయ్యప్ప, మీగడ శ్రీనివాస్, పెంకే గంగాధర్, మెండు బాపిరాజు, మామిడిశెట్టి సురేష్, పిల్లా అరవరాజు, కుక్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ శ్రీ దొమ్మేటి వెంకటరెడ్డికి ఘన నివాళులర్పించిన చెల్లుబోయిన



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతి అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకులు స్వర్గీయ శ్రీ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం వెంకటరెడ్డి 173వ జయంతి సందర్భంగా తాటిపాక సెంటర్లో చెల్లుబోయిన రాంబాబు అంజలి ఘటించటం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంకట రెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించటం అభినందనీయం సంతోషదాయకమని, ఐకమత్యంతో పోరాడితే తప్ప ముందుకి పోలేమని ఆయన భావించి జాతి కొరకు సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసిన ఘనత దొమ్మేటి వెంకటరెడ్డిది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాన్ సూరి అప్పరి రాజేష్. మొల్లేటి హరీష్. రాము జాకీ తదితరులు పాల్గొన్నారు

# నియోజకవర్గంలో 40లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ : బత్తుల



-ఎంపీ కృషితో రూపురేఖలు మారనున్నాయి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గంలో 66 మంది లబ్ధిదారులకు 40 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. గత ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో రెండేళ్లలో రాజానగరం నియోజకవర్గంలో 15 కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఇంటింటికి వెళ్లి బాధితులకు అందించమన్నారు. సోమవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో బత్తుల మాట్లాడుతూ ఇటీవల రాజమహేంద్రవరంలో కల్తీ పాల కారణంగా మృతి చెందిన 16 మందికి, ఒక్కొక్కరికి 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా, గాదరాడలో పాము కరిచి మృతి చెందిన వ్యక్తికి రెండు లక్షల రూపాయలు, ప్రమాదంలో మృతి చెందిన రఘునాధపురం మృతులకు మూడు లక్షల రూపాయలు అందించి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుందన్నారు. పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి రాజమహేంద్రవరంలో టూరిజం అభివృద్ధి, రైల్వే స్టేషన్ ఆధునీకరణ, కార్గో విమాన సర్వీసులు, దివాన్ చెరువు ఫ్లైఓవర్ బ్రిడ్జికి కోట్లాది రూపాయలు నిధులను తీసుకువస్తుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక, ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను ప్రజలు తిప్పుకొట్టాలన్నారు. ఎప్పటిలాగే బత్తుల వెంకటలక్ష్మి ఇంటింటికి వచ్చి అన్ని విధాల పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు బత్తుల వెంకటలక్ష్మి, మేడిశెట్టి శివరాం, యర్రంశెట్టి పోలా రావు, అడపా శ్రీనివాస్, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, మట్టా నాగేశ్వరరావు, మద్దాల పెద్దమ్మాజీ రమణ, జాజుల గణేష్, పలువురు జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# ఆర్డీవోగా ఆర్.శివ రాముడు బాధ్యతల స్వీకారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం కొత్త రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో)గా సోమవారం ఉదయం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆర్. శివ రాముడు అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కు పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ ఆర్. శివ రాముడిని అభినందించారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేయాలని సూచించారు. ఆర్. శివ రాముడు 2007లో అనంతపురం జిల్లాలోని పెద్దవడుగూరు మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఏపీ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా తొలి నియామకం పొందారు. అనంతరం పదోన్నతిపై తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తహసిల్దార్ గా బెతంచర్ల, డోన్, ఆదోని ప్రాంతాలతో పాటు కర్నూలు కలెక్టరేట్‌లో కూడా వివిధ హోదాల్లో సేవలందించారు. అదేవిధంగా కలెక్టర్ ఏవోగా మరియు భూసేకరణ విభాగాల్లో కూడా పని చేసి విశేష అనుభవం సంపాదించారు.ఆర్డీవో గా బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టరేట్ లో రెవెన్యూ క్లినిక్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, పలువురు జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు అభినందనలు తెలిపారు.

# నీటిని కాపాడితే మనసును కాపాడినట్లే..

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా 'సేవ్ వాటర్ - సేవ్ మెంటల్ హెల్త్' నినాదం

-డా.హిప్నో పద్మా కమలాకర్, డా.లక్ష్మీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతిలో నీటిని కాపాడితే మనసును కాపాడినట్లేనని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా కంబాలచెరువు వద్ద ఉన్న డాక్టర్.సాంబ శివా రెడ్డి హాస్పిటల్ లో సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నీటి కొరత ఒక పెద్ద సమస్యగా మారుతుందన్నారు. ఈ కాలంలో"నీటిని ఆదా చేయండి' అనేది కేవలం పర్యావరణ పరిరక్షణకే కాకుండా, మనిషి మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో ముఖ్యమైనదిగా మారిందన్నారు."సేవ్ వాటర్ - సేవ్ మెంటల్ హెల్త్" అనే భావన ఈ రెండు అంశాల మధ్య ఉన్న గాఢమైన సంబంధాన్ని స్పష్టంగా తెలియజేస్తుందని చెప్పారు. నీటి లభ్యత మనిషి భద్రతా భావనకు ఒక ముఖ్యమైన మూలమై దన్నారు. నీటి కొరత వల్ల మనం చేయలేని పనులు పెరిగినప్పుడు, నియంత్రణ భావన తగ్గిపోతుందని చెప్పారు. ఇది డిప్రెషన్ వంటి సమస్యలకు కూడా దారితీయవచ్చన్నారు. హోమియో ఫిజిషియన్ డాక్టర్ లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం, మానసిక ప్రశాంతతకు కీలకమన్నారు. నదులు, చెరువులు, వర్షం వంటి నీటి వనరులు మనకు కేవలం అవసరం మాత్రమే కాదు, అవి మన మనసుకు శాంతిని కూడా ఇస్తాయని తెలిపారు. నీటి వనరులు తగ్గిపోతే, ఈ ప్రకృతి అనుబంధం కూడా దెబ్బతింటుందన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజశ్వి, హాస్పిటల్ నర్సులు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా అసత్యప్రచారాలు మానుకోవాలి

ఎడిటింగ్లు చేసిన ఆడియోలతో రాజకీయ ఉనికి ప్రయత్నం

మహిళ కుటుంబ సమస్యను వైసిపి రాజకీయం చేయరాదు - మీడియా సమావేశంలో టీడీపీ ఎస్సీ నాయకులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక బాధిత మహిళ కుటుంబంలో జరుగుతున్న వివాదంలో వైసిపి నేతలు అనుచితంగా జోక్యం చేసుకొని నీచ రాజకీయాలకు దిగడం దారుణమని తెలుగుదేశం పార్టీకి చెందిన ఎస్సీ నాయకులు ధ్వజమెత్తారు. పాలచర్ల కు చెందిన వై విజయ దేవి, ఆమె భర్తకు, అత్తకు, జాన్ అనే మరో వ్యక్తికి మధ్య కాపురానికి సంబంధించిన వివాదం చోటు చేసుకోవడం, పోలీస్ కేసుల వరకు వెళ్లడం, పెద్దమనుషులతో చర్చలు జరగడం తెలిసిందే. ఈ సమస్యపై బాధిత మహిళ కుటుంబం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును సంప్రదించగా, బాధిత మహిళా అత్తతో మాట్లాడిన మాటలను వక్రీకరించి వైసిపి నేతలు స్వార్థ రాజకీయాలకు పాల్పడడం సరికాదన్నారు. స్థానిక ఆనం రోటరీ హాల్లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ మాట్లాడుతూ బాధిత మహిళా కులానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ అప్పారావు ఆడియోలో మాట్లాడిన మాటలను వైసిపి నేతలు వక్రీకరించి (ఎడిట్ చేసి) దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2019 - 2024 ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన మాజీ ఎంపీ, వైసీపీ నేతలు ఓటమిని జీర్ణించుకోలేక అత్యధిక మెజార్టీతో గెలిచిన ఆదిరెడ్డి వాసు కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని తప్పుడు ప్రచారాలు, వక్రీకరించిన వీడియోలు, ఆడియోలతో రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి చేస్తున్నారని ఆయన విమర్శించారు. జగన్ హయాంలో డాక్టర్ సుధాకర్ మొదలు దళితున్ని హత్య చేసి డోరు డెలివరీ చేసిన వరకు దళితులపై, మహిళలపై జరిగిన దాడులు దౌర్జన్యాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ తురకల నిర్మల మాట్లాడుతూ దళితులను కించపరిచారని, అన్యాయం జరిగిందని మోసలి కన్నీరు కారుస్తున్న వైసీపీ నేతలు వారి హయంలో దళితులకు జరిగిన అన్యాయాలపై , అవమానాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కప్పల వెలుగు కుమారి మాట్లాడుతూ బాధిత మహిళా అత్త చంద్రకళకు దళిత వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉండడం, దాన్నుంచి బయటపడేందుకు కోడలు, కొడుకు కాపురాన్ని విడగొట్టేందుకు చంద్రకళ చేస్తున్న చర్యలను ఆదిరెడ్డి అప్పారావు ప్రశ్నించడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ సిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చాపల చినరాజు మాట్లాడుతూ ఆదిరెడ్డి అప్పారావు ఆడియోను ఎడిటింగ్ చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో దళిత నాయకులు నాయకులు కోరుమిల్లి విజయ శేఖరు, మొకమాటి సత్యనారాయణ, ఈతలపాటి రవి, తానేటి కృపామణి, మామిడి శ్రీను, బూరా రమణ, కానేటి ప్రభు, నాగేశ్వరరావు, మోత నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలి


## రంపచోడవరం ఐటిడిఎ పిఓ బి.స్మరణ్ రాజ్‌కి వినతి పత్రాలు అందజేసిన ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంపచోడవరం నియోజక వర్గం,రంపచోడవరం ఐటీడీఏ పీవో బి.స్మరణ్ రాజ్ కి గ్రీవెన్స్ నందు ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశామని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ,(1) ఏజెన్సీ మారుమూల గ్రామాలకు (బీటీ) తారు రోడ్లు యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయాలని, (2) దేవారం గ్రామపంచాయతీ,ఇందుకూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చెరువులకు తూములు కలింగులు కొత్తవి నిర్మించాలని ఏర్పాటు చేయాలని, (3) ముసురుమిల్లి ప్రాజెక్టు కెనాల్ ద్వారా దేవారం,శరభ వరం గ్రామ పంచాయతీల 8 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని, (4) జీవో నెంబర్ మూడు స్థానంలో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియమాకాల చట్టం ప్రకటించాలని, (5) ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని, (6) ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని,(7) ఐటీడీఏ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని, (8) ప్రతి ఆశ్రమ హాస్టల్స్ ఇద్దరేసి ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని, (9) ఇందుకూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తక్షణమే అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, (10) గౌరవ హైకోర్టు వారు ఇచ్చిన జీవోలు మరియు ఆర్డర్స్ అమలు చేయాలని, (11) పెద్ద భీం పల్లి 2 ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలను తక్షణమే ప్రారంభించాలని, (12) ఆదివాసీ రైతులకు సోలార్ ఫెన్సింగ్ మరియు వ్యవసాయ యంత్ర పనిముట్లు 90 శాతం సబ్సిడీ ద్వారా మంజూరు చేయాలని, (13) దేవారం,చిన్నారి గండి,లోతుపాలెం మొదలైన గ్రామాలలో ఉన్న శిథిల వ్యవస్థలో ఉన్న అంగన్వాడీ బిల్డింగులను తొలగించి కొత్తవి మంజూరు చేయాలని,(14) చిన్నారి గండి ఆర్ అండ్ ఆర్ కాలనీ పెనికలపాడు గ్రామానికి వ్యక్తిగత మరుగుదొడ్లు తక్షణమే మంజూరు చేయాలని, (15) చిన్నారి గండి ఆర్ అండ్ ఆర్ కాలనీ పెనికిలపాడు గ్రామానికి సత్యసాయి మంచిని ట్యాంకు నిర్మించి మంచినీళ్లు అందించాలని, (16) ప్రతి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు సోలార్ పెన్సింగ్ మంజూరు చేయాలని,(17) రంపచోడవరం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని, (18) దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా ఆదివాసీ విద్యార్థులు ఉండేందుకు హాస్టల్ భవనం నిర్మాణం చేపట్టాలని,(19) ట్రైబల్ యూనివర్సిటీ రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేయాలని, (20) రంపచోడవరంగా ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని, (21) ఆదివాసి ప్రజలందరికీ సింగిల్ విండో విధానం అమలు చేయాలని మొదలైన సమస్యలపై వినతి పత్రాలు అందజేశామన్నారు.ఈ సమస్యలు పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రంపచోడవరం ఐటీడీఏ పీవో బి.స్మరణ్ రాజ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు, బుచ్చిరాజు, సరస్వతి మొదలైన వారు పాల్గొన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 23 మార్చి 2026

4

www.viswamvoice.com


# దూలపల్లి సుబ్బారావు ఆశయాలు మనం ముందుకు తీసుకెళ్దాం..

**జీవితాంతం మాదిగ జాతికి సేవలు అందించారు - ఘనంగా డాక్టర్ సుబ్బారావు సంతాప సభ**

**నివాళులర్పించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు, ఎంఆర్పీఎస్ నేతలు, కుటుంబసభ్యులు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శనివారం సాయంత్రం 5 గంటలకు రాజమండ్రి రోడ్డు భవనాల అతిథి గృహంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో (ఎం ఈ ఎఫ్) జాతీయ కోశాధికారి స్వర్గీయ డాక్టర్ సుబ్బారావు సంతాప సభ ఎం.ఈ.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాతపూడి వెంకటేష్ అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు.తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కొల్లి సామ్ సన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ డాక్టర్ సుబ్బారావు తన జీవితాంతం మాదిగ జాతికి ఎంతో సేవ చేసారని.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావానికి ముందే మాదిగ సేవా సంఘం అనే పేరుతో 1981 నుండే జాతికి ఎనలేని సేవ చేసారనీ..తర్వాత ఎమ్మార్పీఎస్ లో మొదటి నుండి కూడా ఎంతో సేవ చేసారని తెలిపారు.ఆయన ఆశయాలను మనం ముందుకు తీసుకు



పోవాలనీ అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు గృహాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులకు ఓదార్పు కలగాని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల ఎమ్మార్పీఎస్, ఎం.ఈ.ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. డాక్టర్ ఖండవల్లి లక్ష్మి, చంద్రమల్ల రాజు మాస్టర్, కాకినాడ జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షుడు చాట్ల ఆశీర్వాదం, డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఉందుర్తి వెంకట్రావు,తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కొల్లి సామ్ సన్.. బెన్ జాన్సన్, కాకాడ చంటి బాబు,సవరం వీర్రాజు, కుడెల్లి అర్జున్, సురేష్, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ డాన్ సూరి,తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జ్ బయ్యారపు రాజేశ్వరరావు, కాకినాడ జిల్లా ఇంచార్జ్ పసుపులేటి చినబాబు,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు, దుళ్లపల్లి వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు గెద్దం వినోద్,కాకినాడ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు,డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవ మూర్తి,ఎమ్మెస్పీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కొడమంచిలి సత్యనారాయణ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు,డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు,తదితరులు హాజరయ్యారు.

# కృష్ణమాచార్యులు చెరువులో పూడికతీతలు తీయించండి

**కోరుకొండ, గోనగూడెం రైతులు అభ్యర్థన**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ కృష్ణమాచార్యుల చెరువులో పూడికతీతలు తీయించి చెరువులో నీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకొండ పశ్చిమ గోనగూడెం రైతులు రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణకు వినతిపత్రం అందజేసినట్లు రెండు గ్రామాల రైతులు తెలిపారు. సోమవారం రెండు గ్రామాల రైతులు పాత్రికేయులతో మాట్లాడుతూ కృష్ణమాచార్యులు చెరువులో గత నాలుగు సంవత్సరాల నుండి ముడికతీతలు తీయకపోవడం వల్ల రెండు పంటకు సరిపడా నీరు నిలువ ఉండటం లేదన్నారు. సుమారు 45 ఎకరాలు విస్తీర్ణం గల చెరువు క్రింద సుమారు 400 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఈ వేసవి లో పూడికతీతలు తీస్తే, రెండు పంటలకు సరిపడే నీరు నిల్వ ఉంటుందని రైతులు తెలిపారు. అదేవిధంగా గోనగూడెం స్మశాన వాటిక నుండి చెరువుకు సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొద్ది దూరం రోడ్డు వేశారని, శాసనసభ్యులు రెండు గ్రామాల రైతుల అభ్యర్థుల మేరకు ఆ రోడ్డును కొనసాగించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రైతులు కాటూరి కృష్ణమోహన్, రొంగల శ్రీనివాస్, కుచ్చు చెల్లారావు, ఉప్పలపాటి అబ్బులు, కోడినాగుల ప్రసాద్, బత్తిన సూరిబాబు, రెండు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన**

# ఎమ్మెల్యే బత్తుల బల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులకు బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కోరుకొండ జనసేన కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ, బత్తుల వెంకట లక్ష్మి చేతుల మీదుగా లబ్ధిదారులకుఅందజేశారు. ఇనుగంటివారిపేట గ్రామానికి చెందిన నల్లూరి సునీతకు రూ.20,000/-లు, బలిమి లీలా సాయి కృష్ణకు రూ.21,078/-లు, రఘుదేవపురం గ్రామానికి చెందిన మల్లి మొగ్గల శ్రీలక్ష్మికి రూ.25,655/-లు, నలమాటి రమణకు రూ.43,727/-లు, కూనవరం గ్రామానికి చెందిన అయేలా చిన పాపారావుకు రూ.1,00,457/-లు, మిర్తిపాడు గ్రామానికి చెందిన అనివిరెడ్డి పృథ్వీ రాజుకు రూ.26,218/-లు, అంకంరెడ్డి లక్ష్మి కి రూ.93,279/-లు,ముగ్గుళ్ళ గ్రామానికి చెందిన పెందుర్తి శివరామకృష్ణ కు రూ.31,084/- లు, చాపర్ల విజయలక్ష్మికి రూ.37,638/- లు, నాగంపల్లి గ్రామానికి చెందిన ఉప్పలపాటి రామచంద్రరావుకు రూ.86,928/-లు, పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన తాడి రంగా పాండురంగారావు కు రూ.52,522/-లు, సింగవరం గ్రామానికి చెందిన చౌటుపల్లి వెంకటేశ్వరరావుకి రూ. 95,890/- లు, కాంతం రామారావుకు రూ. 61,572/- లు,వంగలపూడి గ్రామానికి చెందిన కాంద్రేగుల నాగకుమారికి రూ. 1,03,026/-, సుద్దపల్లి వెంకట రావు కి రూ.44,268/లు, అందజేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ మాట్లాడుతూ, మొత్తం 66 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీచేశామని మంజూరైన మొత్తం సుమారు రూ.40లక్షలని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


# ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ మహా అభియాన్ : కోడూరి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శతాబ్ది మహోత్సవంలో భాగంగా సోమవారం పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యకర్తల పరిచయ వేదిక కోడూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్లో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు అడపా సుధీర్ ఆధ్వర్యంలో పాత, కొత్త సమర్థులైన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోడూరి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆవశ్యకత, కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, పార్లమెంట్ సభ్యురాలు పురందరేశ్వరి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుండి ఢిల్లీ, బొంబాయి, తిరుపతి వంటి మహానగరాలకు కార్గో విమాన సేవల ఆవశ్యకతను తెలిపారు. త్వరలో రాజమహేంద్రవరం నాలుగోవ బ్రిడ్జ్ మీద ఆరు లైన్ల రహదారి విస్తరణకు 2.25 కోట్లు, ప్రధాన రైల్వే స్టేషన్ ఆధునికరణకు 271.43 కోట్లు, టూరిజం అభివృద్ధికి 94.74 కోట్లు, దివాన్ చెరువులో ఫ్లై ఓవర్ నిర్మాణనికి 246 కోట్లు కేంద్ర నిధులతో రాజమహేంద్రవరం సుందరీకరణతో త్వరలో రూపురేఖలు మారని ఉన్నాయన్నారు. ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి పార్టీని మరింత ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. అనంతరం కార్యకర్తల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు శ్యాం ప్రసాద్, ఏపీఆర్ చౌదరి, అడపా సుధీర్, మద్దిపాటి రజిని, నీలపాల వెంకన్న, తగరంపూడి గణపతి, శీర్ల రాధాకృష్ణ, శీర్ల దొరబాబు, చొంగా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో పోలీసుల సేవలు ప్రశంసనీయం

**ఏడిద గ్రామంలో పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమం - మండపేట రూరల్ ఎస్సై కిషోర్ ను సత్కరించిన కూటమి నాయకులు**



**మండపేట రూరల్, విశ్వంవాయిస్ న్యూస్ :** గ్రామ ప్రజలు డిజిటల్ అరెస్టులు, సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండి అవగాహన పెంపొందించుకోవాలని మండపేట రూరల్ ఎస్సై వి.కిషోర్ సూచించారు. మండపేట మండలం ఏడిద గ్రామంలో గల అంబేద్కర్ నగర్లో వి. కిషోర్ ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పర్వతిన వీర్రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై కిషోర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు డిజిటల్ అరెస్టులు, సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీర్రాజు మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నేరాల సంఖ్య తగ్గిందని తెలిపారు. గ్రామ సహకార సంఘం అధ్యక్షులు గొడవర్తి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మేకా జేజిబాబు మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే స్పందిస్తూ చాకచక్యంగా వ్యవహరిస్తున్న పోలీసులను అభినందిస్తూ, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పర్వతిన వీర్రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ కిషోర్‌ను దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రాష్ట్ర పండుగగా దొమ్మేటి వెంకటరెడ్డి**

# జయంతి నిర్వహణ

**ఫలించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషి**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

శెట్టిబలిజ సమాజాన్ని ఐక్యం చేసి, వారికి సమాన గౌరవం, సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించేందుకు కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి జీవితం ప్రతి శెట్టిబలిజ యువతకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిశాంతి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళు లు సమర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, శెట్టిబలిజల ఆత్మగౌరవానికి ప్రభుత్వ గౌరవం కల్పించే దిశగా ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. శెట్టిబలిజ సమాజం ఐక్యంగా ముందుకు సాగుతూ విద్య, సేవ, సామాజిక బాధ్యతల ద్వారా ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు. దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ సమాజ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహనీయుడని తెలిపారు. విద్యా ప్రోత్సాహం, సామాజిక ఐక్యత, సమాన హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన జీవితం సమానత్వం, సామాజిక సమైక్యత వంటి విలువలకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్చి 23ను రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. 1853 మార్చి 23న కోనసీమలో జన్మించిన ఆయన, అమలాపురంలోని బ్రిటిష్ కాలం నాటి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించినట్లు తెలిపారు. శెట్టిబలిజ సమాజంలో విద్య, ఆత్మగౌరవం, ఐక్యతను పెంపొందించేందుకు శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి ఆయన విశేష కృషి చేశారని చెప్పారు. ఆయన ప్రయత్నాల వల్ల వెనుకబడిన వర్గాల్లో విద్యా చైతన్యం పెరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జ్యోతిలక్ష్మి దేవి, శెట్టిబలిజ సంఘ ప్రతినిధులు, బీసీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

**లోకేశ్ గారూ..**

# మా కేసులు కూడా రెడ్ బుక్‌లో చేర్చండి..

**కుందాలపల్లి దోషులను జైళ్లలో పెట్టండి**

**విదసం నేత డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్**

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**




కుందాలపల్లి గ్రామంలో దళితుడి అంతిమ యాత్రపై జరిగిన దాడికి బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కోరారు. కుందాలపల్లి ఘటనలో నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు, అంబేద్కర్ కోనసీమ జిల్లా దళిత సంఘాల ఆధ్వర్యంలో 'ఛలో అమలాపురం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ కుల వివక్షను నిర్మూలించాలంటే తక్షణ అరెస్టులు, కఠిన శిక్షలే సరైన మార్గమన్నారు. కుందాలపల్లి ఘటనలో దోషులను వెంటనే జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్న చిన్న నేరాలకు 7 సంవత్సరాల లోపు శిక్షలు విధించే చట్టాలను కఠినంగా అమలు చేసే పోలీసులు, ఎస్సీలపై జరుగుతున్న తీవ్రమైన అట్రాసిటీ దాడుల విషయంలో మాత్రం నిందితులకు స్టేషన్ బెయిల్ ఇస్తూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఈ కారణంగానే అంబేద్కర్ స్ఫూర్తితో ఉన్న కోనసీమలో కూడా పునరావృతంగా కుల దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల అంబటి రాంబాబు పై నమోదైన 126(2), 351(2) సెక్షన్లను ప్రస్తావిస్తూ, అదే విధంగా అట్రాసిటీ చట్టం వర్తించే కుందాలపల్లి నిందితులపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బొంతు రమణ మాట్లాడుతూ, ఎస్సీలపై దాడులు జరిగినప్పుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమయానికి స్పందించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. కొంకీ రాజమణి మాట్లాడుతూ, ఘటన జరిగిన మూడు రోజుల తరువాత మాత్రమే కేసు నమోదు చేయడం పోలీసుల నిర్లక్ష్యమని, ఇది చట్టరీత్యా తప్పు అని పేర్కొన్నారు. అట్రాసిటీ నిందితులను కూడా 'రెడ్ బుక్'లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రేవు తిరుపతిరావు, గిడ్ల వెంకటేశ్వరరావు, మందా సత్యనారాయణ, ఎస్. తులసి, బాబురావు, గుడివాడ ప్రసాద్, నాగరాజు, గోడి వెంకటేశ్వరరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

**దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర వేడుకగా**

# ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు : రెడ్డి శ్రీనివాస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శెట్టిబలిజ సామాజిక వర్గ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ప్రతి సంవత్సరం మార్చి 23న రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్, బీసీ నాయకుడు రెడ్డి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.సమాజానికి విశేష సేవలు అందించిన మహనీయుడైన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర స్థాయిలో జరపడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన నాయకులకు మరియు సంఘ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి నిర్ణయాలు మహనీయుల సేవలను కొత్త తరాలకు పరిచయం చేస్తాయని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతి కార్యక్రమం






**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వక్తలు మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంబాజీపేట బస్టాండ్ ఎదుట కూటమి నాయకులు, అలాగే అంబాజీపేట చౌరస్తాలో వైకాపా నాయకులు, కూటమి నాయకులు వేర్వేరుగా జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీమతి బి. మమత, ఎంపీటీసీ సభ్యులు ముత్తాబత్తుల ప్రశాంత్, ఇతర నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొని ఘన నివాళులర్పించారు.


**సామాజిక ఐక్యత, ఆత్మగౌరవ సాధన కోసం**

# విశేష కృషి చేసిన దొమ్మేటి





**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** శెట్టిబలిజ జాతి అభ్యున్నతి, అభివృద్ధికి జీవితకాలం పాటుపడిన మహనీయుడు దొమ్మేటి వెంకట రెడ్డిని ఏఎంసీ ఉపాధ్యక్షుడు కేత రాంబాబు, మండల టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసు, కాలా సాయిబాబా అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరుతో పాటు సూర్యరావుపేటలో సామాజిక సంస్కర్త శెట్టిబలిజ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు శెట్టి బలిజ జాతిపితగా విశేష గుర్తింపు పొందిన మహనీయులు దొమ్మేటి వెంకట రెడ్డి 173వ జయంతి సందర్భంగా నిలువెత్తు విగ్రహంతో పాటు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ వయోజన విద్య ప్రాధాన్యతను ముందుగానే గుర్తించి సమాజ చైతన్యానికి కట్టుబడి పనిచేసిన ఆయన సేవలను గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్చి 23న ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర వేడుకగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర శెట్టిబలిజి కార్పొరేషన్ చైర్మన్ కుదుపూడి సత్తిబాబు, పోలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, శెట్టిబలిజ అగ్ర నాయకుల నిరంతర కృషి ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టి బలిజల అగ్రనేతలు పాల్గొన్నారు.

పశు సంరక్షణతో

# రైతు కుటుంబానికి ఆర్థిక బలం

- రైతు– పశుసంపద అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం
- రైతు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి
- కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పశు సంరక్షణతోనే రైతుల కుటుంబాలకు ఆర్థిక బలం చేకూరుతుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. వెల్ల గ్రామంలో మార్కెట్ కమిటీ ద్రాక్షారామ ద్వారా జరిగిన ఉచిత పశువైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షుడు బలుసు శివప్రసాద్,వెల్ల గ్రామం ప్రెసిడెంట్, ఎంపీటీసీ, కూటమి పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్, డి వార్మింగ్, లివర్ టానిక్స్, ముఖ్య అతిథులు చేతుల మీదుగా పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ వెల్ల గ్రామానికి మార్కెట్ కమిటీ ద్వారా సమకూర్చే 15 వేల రూపాయల మందులు వెల్ల గ్రామానికి కేటాయించడం జరిగిందన్నారు. ఇక్కడ పశు సంపద ఎక్కువగా ఉన్నందువలన రైతులు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకొని, పాడి పరిశ్రమ అభివృద్ధి చేయడానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా ఏర్పాటు చేసిన ఈ ఉచిత ఫెర్టిలిటీ అండ్ హెల్త్ క్యాంపు రైతులందరూ ఉపయోగించు కోవాలన్నారు. పశు ఆరోగ్య సమస్యలు ఈ క్యాంపు ద్వారా ఉపయోగించుకొని రైతులు అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ వెల్ల చాలా పెద్ద గ్రామం, అలాగే రైతులు కూడా ఇక్కడ ఎక్కువమంది ఉన్నారు కాబట్టి ఈ క్యాంపు ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

దొమ్మేటి వెంకటరెడ్డి మా స్ఫూర్తి

# మానవత్వమే మా అభిమతం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న వ్యక్తికి గల్ఫ్ శెట్టిబలిజ యువ శక్తి సేవా సంస్థ రూ.55 వేల ఆర్థిక సహాయం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిల్లకుర్రు గ్రామ శివారు శ్రీనివాసపురం గ్రామానికి చెందిన దూనబోయిన వెంకటేశ్వరరావు రెండు కిడ్నీలు పాడవటంతో వైజాగ్ ప్రైవేట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నాడు వైద్యులు కిడ్నీ ట్రాన్స్ప్లాంటేషన్ చెయ్యాలని సూచించారు. కిడ్నీ మార్పిడికి అధిక ఖర్చు కావడంతో వారి కుటుంబ సభ్యులు దాతలు సహకారం కోరారు. ఈ విషయం తెలుసుకున్న గల్ఫ్ శెట్టి బలిజ యువశక్తి సేవా సంస్థ సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి, ఆయన వైద్య చికిత్స కోసం రూ.55 వేల రూ ఆర్థిక సాయన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన కొత్తపేట నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ పరిశీలకులు పాటి శివకుమార్ కొత్తపేట నియోజకవర్గం టీడీపీ యువనాయకులు బొక్కా ప్రసాద్ చేతులు మీదుగా అందజేశారు. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ చేస్తున్న ప్రతి సేవాకార్యాక్రమానికి పెద్దమొత్తంలో సహాయం అందజేస్తున్న జియంకే చారుటబుల్ ట్రస్ట్ చైర్మెన్ గుత్తుల మీరాకుమార్ కు అధ్యక్షులు కట్టా భాస్కర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. కుల మత, ప్రాంతాలకు అతీతంగా ఉభయరాష్ట్రాల్లో ఆపదలో వున్న నిరుపేదలకు ఆర్థిక సహాయం చేసి ఆదుకునే గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ చేసిన ఈ సహాయం దూనబోయిన వెంకటేశ్వరరావు కుటుంబానికి ఆశాకిరణంగా మారిందని స్థానికులు గల్ఫ్ శెట్టి బలిజ యువ శక్తి సేవా సంస్థ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ కుడిపూడి రాంబాబు, కోట నాగరాజు, బైరిశెట్టి వెంకటరమణ, దొమ్మేటి రాము,కవురు నరసింహస్వామి, కూడుపూడి ఏకంబారేశ్వరరావు, పిల్లి రమేష్, పిల్లి సూరిబాబు, ముషిని వెంకట రమణ, కముజు గోపి ,ఇళ్ల రామ సుబ్రమణ్యం, ఇళ్ల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యావేత్త, సామాజిక సంస్కర్త

# దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు అనుసరణీయం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యావేత్త, సామాజిక సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు అనుసరణీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా ఆయన నివాళు లర్పించారు. దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ సమాజంలో విద్యాభి వృద్ధికి, ఐక్యత కోసం విశేషంగా కృషి చేశారన్నారు. కోనసీమ ప్రాంతంలో విద్యాభివృద్ధికి పలు పాఠశాలలు స్థాపించారన్నారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించారని, శెట్టిబలిజ జాతిపితగా ప్రఖ్యాతి చెందారన్నారు. 19వ శతాబ్దం తొలినాళ్లలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మరో హామీ నెరవేర్చారని అన్నారు.

# కుండలేశ్వరస్వామి సన్నిధిలో రగడ

**పురోహితులు వైఖరిపై దద్దరిల్లిన కుండలేశ్వరం స్వామి ఆలయం**





**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన, మండలం కుండాలేశ్వరస్వామిసన్నిధిలో రగడ,పురోహితులు వైఖరి పై దద్దరిల్లిన కుండాలేశ్వరస్వామి సన్నిధిలో రగడ. పురోహితులు వైఖరిపై దద్దరిల్లిన కుండలేశ్వరం. ఆధిపత్యపోరులో ఆలయ ప్రాశస్త్యం. విరాళాల సేకరణలో వివరం ఎక్కడ? అక్కల ఆరోపణ! గ్రామస్తులు తీరుపై మండిపడ్డ మురమళ్ళ రాంబాబు.వృద్ధ గౌతమి నది తీరాన దక్షిణ కాశీగా పిలవబడే కుండలేశ్వరస్వామి ఆలయం గత ఐదేళ్లుగా దినదన అభివృద్ధి చెందుతూ,కోనసీమ ప్రాంతంలో శైవక్షేత్రాలు అన్నిట్లో ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచింది. కార్తీకమాస ఆరంభంనుండి భక్తులు వేలసంఖ్యలో స్వామివారి సన్నిధికి విచ్చేసి ఆలయ ప్రాశస్త్యాన్ని అమాంతంగా పెంచేశారు.ప్రముఖ అష్టవధాని, హిందూ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ముక్తావళితో మరుగునపడిన ఆలయానికి కొత్త శోభ సంతరించడంతో పరమేశ్వరుడికి భక్తులు తాకిడి ఎక్కువైంది.ఆలయ ప్రాశస్త్యం, భక్తులు దేవుని దర్శనం,ఆలయ కాంకేర్యాలు,పూజా పద్ధతులు, దేవుని నైవేద్యాలు,భక్తుల ప్రసాద వితరణ,అన్నసమారాధనలు అన్ని కార్యక్రమాలు శాస్త్ర ప్రకారం జరుగుతున్నప్పటికీ ఆలయంలో మధ్యవర్తులు జోక్యంవలన ఆలయ కీర్తి మసకబారిపోతుంది. గత కొంతకాలంగా కుండలేశ్వర స్వామి సన్నిధి తరచూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారిపోయింది.శుక్రవారం కుండాలేశ్వరస్వామి సన్నిధిలో పురోహితులు గ్రామస్తులు మధ్య చిన్నపాటి వాగ్వాదమే జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా కాళ్లకూరి కామేశ్వరరావు ఆలయ ప్రధాన అర్చకులుగా వ్యవహరిస్తూ లక్షలాది రూపాయలు పక్కదారి పట్టిస్తున్నాడంటూ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆరోపణలు చేశారు.కామేశ్వరరావు సొంత ఎజెండాతో బయట వ్యక్తులను ఆలయ కార్యక్రమాల్లో భాగస్వాములుగా చేస్తూ మిగతా వంతులువారి పురోహితులను పనిచేయకుండా అడ్డుకున్నారని కాళ్ళకూరి నాగమల్లేశ్వరశర్మ ఆవేదన చెందారు.దీంతో కుండాలేశ్వరం ఆలయ పురోహితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మురమళ్ళ రాంబాబు జోక్యంచేసుకుని కుండాలేశ్వర గ్రామస్తులతో కలిసి సర్దిచెప్పే ప్రయత్నంచేసినప్పటికీ కుండలేశ్వరం ఆలయం లోపల ఇరుపక్షాల వాదాపు వాదనలతో శైవక్షేత్రం దద్దరిల్లిపోయింది.పురోహితుల వంతులువారి విధానంలో,ప్రధాన అర్చకులు సమయం గడిచిపోయినప్పటికీ ఆలయ అభివృద్ధి నిమిత్తం నేనే ఉంటానంటూ సమావేశంలో కామేశ్వరరావు చెప్పడంతో పురోహితుల మధ్య వివాదానికి తావు లేపింది.పురోహితుల సమస్యకు గ్రామస్తులు ఆజ్యం పోయడంతో సమావేశం కాస్త చినీకి చినీకి గాలివానై వివాదంగా మారిపోయింది.ఈవివాదంలో గ్రామానికి సంబంధించిన ఒకవ్యక్తి పురోహితుడని చేయిపట్టుకుని తొయడంతో పురోహితులకి గ్రామస్తులకు ఈమధ్య కాసేపు వాగ్వాదం జరిగింది.కుండలేశ్వర స్వామి ఆలయంలో అర్చుకులు జరుపుతున్న రాజకీయాలు పట్ల గ్రామంలోని ఒకవర్గం గత రెండు మూడు సంవత్సరాలుగా ఒక కూటమిగా ఏర్పడి భక్తులు విరాళాలు,అన్న సమారాధన విరాళాలు,భక్తులు పురోహితులకు సంభవన చేసే డబ్బులకి ఎవరికి లెక్కలు చెప్పకుండా తినేస్తున్నారంటూ కుండాలేశ్వరం మాజీ సర్పంచ్ అక్కల సత్యనారాయణ ఆరోపించారు. ఆలయానికి సంబంధించిన విషయాల్లో బయట వ్యక్తులు ప్రమేయం సబబు కాదని కుండాలేశ్వరం ప్రస్తుత ఎంపీటీసీ అక్కల శ్రీధర్ మీడియాకు తెలియచేసారు.కుండలేశ్వర స్వామి సన్నిధిలో, బయట వ్యక్తులు భాగస్వాములై,ార్తీక మాసంలో ఆయానికి ఇచ్చే భక్తుల విరాళాలు,అన్నసమారాధనకు ఇచ్చే విరాళాలు కామేశ్వరరావు అండదండలతో బయటవ్యక్తుల జేబులోకి వెళ్తున్నాయని అక్కల శ్రీధర్ ఆరోపించారు.ఆలయ ప్రాశస్త్యం దెబ్బతినే విధంగా ప్రవర్తిస్తున్న కామేశ్వరరావును తక్షణమే విధులు నుండి బహిష్కరించి వేరే వాళ్లకు అప్పగించాలని అక్కలవర్గం భీష్మించుకుని కూర్చుంది.ఆలయంలో గ్రామస్తులు హడావుడి ఎక్కువై ఒక బ్రాహ్మణ యువకుడిపై దౌర్జన్యంగా వెళ్లడంతో బ్రాహ్మణులు ఒక్కసారిగా గ్రామస్తులు డౌన్ డౌన్ అంటూ పురోహితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురమళ్ళ రాంబాబు కాసేపు ఆలయం వెలుపల హల్చల్ చేశారు.అసలు విషయం పక్కదారి పడుతుందనే భయంతో గ్రామస్తులు ఏకమై పురోహితులను బుజ్జగించారు. గ్రామస్తులు బుజ్జగింపులతో బుద్ధిమంతులైన పురోహితులు పంతులు వారి విధానంలో కాళ్లకూరి కామేశ్వరరావు కాళ్లబేరానికొచ్చి ఈసారి అవకాశం కాళ్లకూరి నాగమల్లేశ్వరశర్మకి ఇవ్వాలని అంతిమతీర్పు వెల్లడించారు. చిన్న విషయం కాస్త పెద్ద విషయం అవ్వడంతో కామేశ్వరరావు చేసేదిలేక ఆలయఅర్చక ప్రధాన బాధ్యతలు కాళ్ళకురి నాగమల్లేశ్వరశర్మకి అప్పగించారు.ఆలయ ప్రాశస్త్యం ఊరునోటా మోతమోగుతున్న ఆలయప్రాంగణం మాత్రం రాజకీయరొంపులోపడి ఉక్కురు బిక్కిరి అవుతుంది.

# మోడీ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

**భారత రాజకీయ చరిత్రలో మోదీ సరికొత్త రికార్డు పాలూరి సత్యానందం**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజకీయ చరిత్రలో ప్రధాని నరేంద్ర మోడీ మరో సరికొత్త అధ్యాయాన్ని లికించారు. దేశంలో అత్యధిక కాలం ప్రభుత్వ అధినేతగా పనిచేసిన నాయకునిగా అరుదైన రికార్డును తన పేరిట నమోదు చేసుకున్నారు. 22 నాటికి ప్రధాని పదవిలో 8931 రోజులు పూర్తి చేసుకున్న మోదీ సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ ఛామ్లింగ్ పేరట ఉన్న సుదీర్ఘకాల పదవీకాలం రికార్డును అధికమించారు గతంలో సిక్కుం మాజీ ముఖ్యమంత్రి చామ్లింగ్ 8930 రోజుల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగి రికార్డు నెలకొల్పగా ఇప్పుడు మోదీ ఆ మైలురాయిని అధికమించారు గుజరాత్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం సేవలు అందించడంతోపాటు భారత ప్రధానిగా మోదీ కొనసాగిస్తున్న పయనం ఈ అరుదైన ఘనతను సాధ్యం చేసింది. గుజరాత్ లోని వాద్ నగర్ లో ఒక సామాన్య కుటుంబంలో జన్మించి రైల్వే స్టేషన్లో తండ్రికి టీ అమ్మడంలో సాయపడిన స్థాయి నుంచి దేశాధి నేత వరకు మోడీ ప్రస్థానం స్ఫూర్తిదాయకంగా సాగింది ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ప్రస్తావనం ప్రారంభించిన ఆయన బిజెపిలో కీలక నేతగా ఎదిగారు 2001లో తొలిసారి గుజరాత్ సీఎం గా బాధ్యతలు చేపట్టిన ఆయన 2014 వరకు సుమారు 13 ఏళ్ల పాటు అదే పదవిలో కొనసాగారు ఆ తర్వాత దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికల్లో 2014, 2019, 2024 బిజెపిని అఖండ విజయంతో గెలిపించి హ్యాట్రిక్ ప్రధానంగా రికార్డు సాధించారు తొలి ప్రధాని స్వతంత్ర భారతదేశంలో జన్మించి ప్రధాని పీఠాన్ని అదృష్టం తొలి వ్యక్తి కూడా నరేంద్ర మోడీనే కావడం విశేషం సుదీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవంతో ప్రధాని పీఠాధి అదృష్టంచిన నేతగా కూడా మోడీ తన ప్రత్యేకత చాటుకున్నారుచాటుకున్నారని ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని దేశానికి మరింత సేవ చేయాలని పాలూరి సత్యానందం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తెలిపారు.

# ప్రముఖ వైసిపి నాయకుడు చెల్లుబోయినను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి దేవి

**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాజోలు వైసిపి ఇన్చార్జ్, మాజీఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి పిలుపునిచ్చారు.. వైసిపి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించిన తరువాత ప్రతి గ్రామంలో ప్రముఖంగా ఉన్న నాయకులను కలిసి తమకు సహకరించి పార్టీ బలోపేతానికి మీ వంతు కృషి చేయాలని ఆమె కోరుతున్నారు.. అనంతరం రాజోలు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు చెల్లుబోయిన రాంబాబుని మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చురుకైన పాత్ర పోషించాలని ఆమె కోరారు.. అనంతరం రాజేశ్వరి దేవి మాట్లాడుతూ తమకు పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజోలు ఇంచార్జ్ బాధ్యత అప్పగించిన నుంచి ప్రతి గ్రామంలో వైసీపీ నాయకులను, కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాజేశ్వరి దేవి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ యువజన



విభాగ ప్రధాన కార్యదర్శి పాములప్రకాష్, రాజోలు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సీనియర్ నేత కంచర్ల శేఖర్, గుబ్బలమనోహర్, బల్ల శీను తదితరులు పాల్గొన్నారు.

# దొమ్మేటి జయంతిని ప్రభుత్వం అధికారంగా నిర్వహించటం అభినందనీయం : గుబ్బల మూర్తి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన రెడ్డి తాతాజీ గుబ్బల మూర్తి కృషి చేసిన శెట్టిబలిజ జాతి రామలక్ష్మణులు మంత్రి వాసంశెట్టి సుభాష్, చైర్మన్ కూడుపూడి సత్తిబాబులకు ప్రత్యేక అభినందనలు శెట్టిబలిజ జాతి పితామహుడు శెట్టిబలిజ జాతి ఐక్యత కోసం కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారం గా నిర్వహించాలని ప్రభుత్వం జీవో విడుదల చేయటం అభినందనీయం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మంత్రి నారా లోకేష్కి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్కి శెట్టిబలిజ నాయకులు రెడ్డి తాతాజీ, గుబ్బల మూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి ఎంతో కృషి చేసిన శెట్టిబలిజ జాతి యువ నాయకులు రామ లక్ష్మణులుగా పిలవబడుతున్న శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కూడిపూడి సత్తిబాబు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు వారికి సహకరించిన శెట్టిబలిజ పెద్దలు తదితరులకు కృతజ్ఞతాభివందనములు తెలియజేశారు.సామాజిక వర్గాల అభిప్రాయాలను గౌరవిస్తూ కూటమి ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని వివిధ సామాజిక వర్గాలు వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు నిర్ణయం తీసుకోవడం కూడా అభినందనీయమని ఈ సందర్భంగా తెలియజేశారు. శెట్టిబలిజ జాతికి గుర్తింపునిచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసుకుంటూ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రాజమండ్రి ఆనం కళా కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. కనుక ఈ కార్యక్రమానికి శెట్టిబలిజ నాయకులు కుల సంఘ పెద్దలు తదితరులు అందరూ కూడా హాజరై కృతజ్ఞతను తెలియజేయవలసిందిగా కోరుతున్నాం అని తెలియజేశారు.

విశ్వగురు ఉగాది పురస్కారం అందుకున్న

# పెద్దింటి కృష్ణ వంశీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డా.బి.ఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మైక్రో ఆర్టిస్టుగా పేరు తెచ్చుకుని 20ప్రపంచ రికార్డులు సాధించి సినీరంగంలో అడుగుపెట్టిన కొత్తపేటకి చెందిన సినినటుడు పెద్దింటి కృష్ణవంశీ విశ్వగురు ఉగాది పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. కొత్తపేటకు చెందిన ప్రముఖ పురోహితులు డాక్టర్ పెద్దింటి రామం కుమారుడైన కృష్ణవంశీ చిన్నతనం నుంచి మైక్రో ఆర్టిస్ట్గా అనుభవం సంపాదించారు. సినిమా రంగంలో అడుగుపెట్టి కరిగే ఈక్షణం ఓవరమై, కొత్తరంగుల ప్రపంచం, మాతృ, గాసిప్స్, ఆంధ్రులు అన్నపూర్ణ డొక్కాసీతమ్మ, సిరా, ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు,6.9, పందిరిమంచం సినిమాల్లో నటించారు దీనిని పురస్కరించుకుని కృష్ణవంశీని విశ్వగురు ఉగాది పురస్కారం అవార్డుకు ఎంపిక చేసినట్లు వంశీ తెలిపారు ఆ మేరకు విశాఖపట్నం దాస్పల్లా హోటల్ ఫంక్షన్ హాలులో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో విశ్వ గురు సంస్థ వ్యవస్థాపకులు సత్యవోలు రాంబాబు, విశాఖపట్నం పోలీసు కమిషనర్ శంకర్ భాగ్జి, ప్రముఖ సినీ నటుడు రాజీవ్ కనకాల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు కృష్ణవంశీ తెలిపారు.

దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు

# మనందరికీ ఆదర్శం

కొత్తపేట టీడీపీ నాయకులు బండారు సంజీవ్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** దొమ్మేటి జయంతిని "రాష్ట్ర పండుగ"గా ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్లకు ప్రత్యేక ధన్యవాదాలు శెట్టిబలిజ జాతిపిత, ప్రముఖ విద్యావేత్త, సామాజిక సంస్కర్త శ్రీ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను సోమవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువనాయకులు బండారు సంజీవ్ రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ,రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కేత శ్రీనివాస్ తో కలిసి దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బండారు సంజీవ్ ప్రసంగిస్తూ దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను కొనియాడారు. శెట్టిబలిజ సామాజిక వర్గంలో ఐక్యత తీసుకురావడంతో పాటు, కోనసీమ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం అనేక పాఠశాలలు స్థాపించి ఆయన చేసిన విశేష కృషిని గుర్తుచేసుకున్నారు.

కొత్తపేటలో ఘనంగా శెట్టిబలిజ జాతిపిత

# దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శెట్టిబలిజ సమాజానికి విద్య,ఐక్యత, గౌరవం తీసుకువచ్చిన గొప్ప సామాజిక సంస్కర్తగా,శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి వారి అభ్యున్నతికి విశేషంగా కృషిచేసిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని కొత్తపేట ఆర్ యాస్ బి సి కన్వెన్షన్ హల్ వద్ద కొత్తపేట మండల శెట్టిబలిజ(పెద్దలు) మరియు యువజన సంఘాలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పై ఆనందం వ్యక్తం చేసి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్కి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు కి,టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం కి,ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ కి,జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయికి, శెట్టిబలిజ సంఘ పెద్దలకు, నాయకులకు ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా నేటి యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ అధ్యక్షులు కముజు వెంకటేశ్వరరావు, అధ్యక్షులు రెడ్డి రామకృష్ణ, సెక్రెటరీ గుబ్బల సత్తిపండు, యువజన సంఘం అధ్యక్షుడు శీలం కొండబాబు, యువజన సంఘం అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, సలహాదారులు కొప్పిశెట్టి వాసు, ముషిని వెంకట రమణ, ఉపాధ్యక్షుడు జోగి మురళీ,యువజన సంఘం సెక్రెటరీ రాయుడు కార్తీక్, కొత్తపేట మండలం బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడు కడలి పార్థసారథి,కొత్తపేట మండల టీడీపీ పార్టీ సెక్రెటరీ కడలి భీమేష్, కముజు గోపి,కముజు తాతాజీ,రాయుడు బాబీ, జోగి గని రాజు, కొప్పిశెట్టి శ్రీరామ్,కుడిపూడి వెంకటేశ్వరరావు,బొంతు గౌరీ శంకర్,శీలం సూర్య చంద్రరావు,దునబోయిన హరినాథ్,కుడిపూడి నాగు,దునబోయిన ప్రదీప్, దునబోయిన ఏడుకొండలు, అప్పారి శ్రీనివాస్, కేతా సతీష్,ఇళ్ల మూర్తి, వాసంశెట్టి సత్యనారాయణ,మట్టపర్తి ప్రసాద్, కముజు రాజు తదితరులు పాల్గొన్నారు.



# క్రైస్తవ సంఘంలో నిధులు గోల్ మాల్..?




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** వాకలపూడి గ్రామంలో గల ప్రముఖ మూడవ ఏపీఎస్పీ యూనియన్ క్రైస్తవ సంఘంలో భారీ స్థాయిలో ఆర్థిక అక్రమాలు జరుగుతున్నాయని ఆ సంఘం కౌన్సిల్ సభ్యురాలు సంచలన ఆరోపణలు చేశారు. గత 20 ఏళ్లుగా సంఘం నిధులకు సంబంధించిన ఎలాంటి లెక్కలు చూపడం లేదని, ప్రశ్నిస్తే మహిళ అని కూడా చూడకుండా వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఎస్పీ చర్చిలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, సక్రమంగా లేవని సదరు చర్చి కౌన్సిల్ సభ్యురాలు అయిన రెడ్డి ఆశా జ్యోతి మీడియా వద్ద పలు ఆరోపణలు చేశారు.రిటైర్డ్ ఉద్యోగులు, టీచర్లు కలిసి ఏర్పాటు చేసుకున్న ఈ సంఘంలో గత రెండు దశాబ్దాలుగా ఒకే వర్గం ఆధిపత్యం కొనసాగుతోంది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఆదాయ, వ్యయాల వివరాలను బహిర్గతం చేయలేదని ఆవేదన చెందారు.చర్చి ఆధునీకరణ పేరుతో కోట్లాది రూపాయల నిధులను వాడుతున్నారని, ఎలివేషన్ మరియు స్లాబ్ పనులకే సుమారు 1.20 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అయితే దీనికి సంబంధించిన కొటేషన్లు, ఎస్టిమేషన్ కాపీలు అడిగితే ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు.సంఘం పేరు మీద ఉన్న బ్యాంక్ ఖాతాల జిరాక్స్ కాపీలు, గత 20 ఏళ్ల స్టేట్‌మెంట్లను కౌన్సిల్ సభ్యురాలిగా అడిగే హక్కు ఉన్నప్పటికీ, నిర్వాహకులు వాటిని తొక్కిపెడుతున్నారని విమర్శించారు.లెక్కలు అడిగినందుకు తనను వ్యక్తిగతంగా దూషించడమే కాకుండా, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా ఐ.ఎస్.పి. కుమార్ అనే వ్యక్తి తన మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని, కౌన్సిల్‌లో చదువుకోని వారు, అవగాహన లేని వారు ఉండటం వల్ల ఈ అక్రమాలకు అడ్డులేకుండా పోయిందని ఆమె వాపోయారు. సుమారు 17 కోట్ల రూపాయల వరకు నిధుల దుర్వినియోగం జరిగి ఉంటుందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం ఒక విచారణ కమిటీని వేయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె మీడియా సాక్షిగా అధికారులను కోరారు.

### సంఘ సభ్యురాలు ఆవేదన...



# వృద్ధురాలిని పొట్టన పెట్టుకున్న కోతుల మూక...!

**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కోతుల మూక మనుషులపై దాడి చేయడం పల్లెల్లోనూ, పొలాల్లోనూ అప్పుడప్పుడూ సహజంగా జరిగేదే. అయితే దీనికి విరుద్ధంగా కోతులు అకారణంగా సామూహికంగా దాడిచేసి ఓ వృద్ధురాలిని పొట్టన పెట్టుకున్న అరుదైన దుర్ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో శనివారం సాయంత్రం జరిగింది. చిన్నా, పెద్దా కలపి 20 కి పైగా కోతులు ఒక్క సారిగా మీద పడి ఏకపక్షంగా దాడి చేయడంతో ఎవరి తోడూ లేని వంటరి వృద్ధురాలు దానబోయిన చిన్నబుల్లి (69) నిస్సహాయురాలై అసువులు బాసింది. గ్రామా శివారున తనకు ఉన్న 3 ఎకరాల జీడిమామిడి తోటలోని ఇంటిలో కూతురు కుటుంబంతో కలిసి చిన్నబుల్లి నివాసం ఉంటోంది. తోటలోని గేదెకు దాణా, కుడితి నీళ్లు పెట్టేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన చిన్నబుల్లి తన పనిలో ఉంది. అప్పటికే అక్కడ కుడితిలోని అన్నం మెతుకులను తరచూ తిని పోయేందుకు




అలవాటు పడిన కోతుల దండు అప్పటికే అక్కడ సిద్ధంగా ఉంది. తమ ఆహారానికి ఆ వృద్ధురాలు ఆటంకమని భావించిన వానర మూక చిన్నబుల్లిపై ఒక్క సారిగా దాడి చేసింది. దీంతో ఆమె తప్పించుకునే వీలు లేకపోయింది. ఆ సమయంలో కాపాడేందుకు ఎవరూ తోడులేక పోవడంతో నిస్సహాయురాలైన వంటరి వృద్ధురాలు కోతుల దాడికి తీవ్ర గాయాలపాలై, అక్కడి కక్కడే మరణించింది. కోతుల బెడద పరాకాష్టకు చేరి వానర మూకల దాడిలో ఒక నిండు ప్రాణం బలి కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి. ఈ ఘటనతో గ్రామస్తులు భయంతో వణికి పోతున్నారు. గ్రామంలో కోతుల ఆగడాలు రోజు రోజుకూ మితిమీరి పోతున్నాయని అదే గ్రామానికి చెందిన కుండల అప్పారావు తెలిపాడు. తన గేదెకు నీళ్లు పెట్టడానికి వెళ్తుండగా కోతులు దాడి చేయడంతో తన కాళ్లకు, శరీరానికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపాడు. గతంలోనూ ఇద్దరు యువకులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని, ఇప్పుడు ఏకంగా ప్రాణనష్టం జరగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోతుల భయం కారణంగా మహిళలు కనీసం తమ ఇంటి తలుపులు తెరచి వంట చేసుకోవడానికి కూడా భయపడు తున్నారు. పిల్లలను బయటకు పంపాలన్నా, నిత్యావసర పనుల కోసం వీధిలోకి రావాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టు కోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 25న తూలగిరి సీతారాముల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం

## చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో ప్రతిష్ట మహోత్సవం - ఆలయ నిర్మాణంలో ఎమ్మెల్యే సహకారం మరువలేనిది

**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడులో 25న శ్రీసీతా, రాముల ప్రాణ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగ నున్నది. ప్రత్తిపాడులో జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్ర గిరిపై తూలగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ పూర్వ కార్యక్రమాలు 20 తేదీ నుండి కన్నుల పండుగగా జరుగు తున్నాయి. ఈ శ్రీ సీతా రాముల విగ్రహాల ప్రతిష్ఠితా మహోత్సవం చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో జరుగ నున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వివరాలను చిన జీయర్ స్వామి శిష్యుడు శ్రీ పరాశర రఘునాథ భట్టర్ స్వామి సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పరిసర గ్రామాల ప్రజలు హాజరై రాములోరి ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి





స్వీయ పర్యవేక్షణలో వేదమంత్రాల సాక్షిగా శ్రీ సీతారాముల విగ్రహాల ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, ఉప ఆలయాల ప్రతిష్ట మహా వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లునూ పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ నిర్మాణానికి విశేష కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో పాటు పలువురు నాయకులు హాజరు కానున్నరని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు అడిగిన వెంటనే సిసి రోడ్ నిర్మాణంతో పాటు తమ అనుచర గణంతో భారీ విరాళాలు ఇప్పించి నందుకు ఎమ్మెల్యే సత్యప్రభకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ గుడి నిర్మాణానికి సహకరించిన ప్రతి భక్తుడికి రాములోరి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. రాములోరి భక్తులు ఉత్సాహంగా ఈ మహా యజ్ఞ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. దర్శనార్థం వచ్చిన భక్తులకు మధ్యాహ్నం 11 గంటల నుండి అన్న ప్రసాద వితరణ చేస్తారని తెలిపారు.

# ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండల గ్రామాల్లో శెట్టిబలిజ సోదరులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకల్ని వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాజులూరు మండలం దుగ్గుదూరు గ్రామంలో జరిగిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకల్లో సత్యం వాసంశెట్టి పౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, పలువురు నాయకులు పాల్గొని దొమ్మేటి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం దొమ్మేటి జయంతిని అధికారిక పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో శెట్టిబలిజ నాయకులు ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ దొమ్మేటివెంకటరెడ్డి జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని అప్పటి కాలంలోనే ఆయన బర్మా దేశానికి వెళ్లి అక్కడ పాలకవర్గంలో స్థానం సంపాదించి బర్మా కేసరిగా ప్రసిద్ధి చెందారని పేర్కొన్నారు. శెట్టిబలిజ జాతిని హీనంగా పరిగణించే నాటి రోజుల్లో జాతి ఉద్ధరణ కోసం ప్రతినపూని సంఘ అభివృద్ధికి విద్య సరైన మార్గమని తలంచి తన ఆస్థిని ప్రజాసేవల కోసం పంచి ఎంతో మంది విద్యావంతులను తయారుచేసారని వివరించారు. దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా ప్రకటించడం ద్వారా యువగళం పాదయాత్రలో శెట్టిబలిజలకు నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టు కున్నారని తెలియజేసారు ఈ కార్యక్రమంలో కోనసీమజిల్లా టిడిపి అధికార ప్రతినిది వనుం వీరబ్రహ్మం, బీసీ సెల్ అధ్యక్షులు చీకట్ల సూరిబాబు, ఉపాధ్యక్షులు గుబ్బల నాగేంద్రకుమార్, కురుపూడి గోవిందరాజులు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అక్కల యశ్వంత్ రాయ్, మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, నాటకపరిషత్ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, సాంబశివరావు, బీసీ నాయకులు వల్లు అర్జునరావు, టేకుముడి సత్యనారాయణ, గుబ్బల యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు అనుసరణీయం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యావేత్త, దొమ్మేటి వెంకట రెడ్డి ఆశయాలు అనుసరణీయమని ఏపీ మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వర రావు పేర్కొన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయనకు నివాళులర్పించారు. దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ సమాజంలో విద్యాభివృద్ధికి, ఐక్యత కోసం విశేషంగా కృషి చేశారన్నారు.కోనసీమ ప్రాంతంలో విద్యాభివృద్ధికి పలు పాఠశాలలు స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఓ.రవి కిరణ్, జడ్పిటిసి నేలకిషోర్, ఎంపీపీ కోలాట సత్యవతి సత్యం, నాయకులు నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి ఆనందరావు, శీలం సూర్యనారాయణ, పిల్లి ప్రసాద్, మోకా అప్పాజీ, డిప్యూటీ ఎంపిడిఓ నున్న శంకర్ నారాయణ, కార్యాలయ పరిపాలన అధికారిణి సంఘమిత్ర, నాయకులు కాంద్రేగుల సత్య ప్రసాద్, దండుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వర రావు, కముజు లక్ష్మీ రమణరావు, వాసంశెట్టి రాజేశ్వరరావు, వనచర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పితృకార్యాలకు రూ.2 లక్షలతో నూతన షెడ్ నిర్మాణం




**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో పెనికేరు గ్రామంలో పితృకార్యాల (పిండ ప్రదానాలు) నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక షెడ్ నిర్మించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో, చెరువు గట్టుమీద సుమారు రూ.2 లక్షల వ్యయంతో ఈ షెడ్‌ను ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు వారి తాతయ్య ఈదర వీరన్న చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ నిర్మాణాన్ని చేపట్టారు. పిండప్రదానం వంటి పితృకార్యాలు సౌకర్యవంతంగా నిర్వహించుకునేందుకు ఈ షెడ్ ఎంతో ఉపయోగపడనుంది. ఇప్పటి వరకు అధ్వానంగా ఉన్న చెరువు గట్టు ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ సదుపాయం కల్పించిన చిన్నబాబును గ్రామస్థులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. చిన్నబాబు సూచనలతో ఇటీవల మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) రాజు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఈ షెడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు గొడవర్తి సూర్య భాస్కరావు, సొసైటీ అధ్యక్షులు మేకా రాంబాబు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు గోపు గోపాలకృష్ణ, మునగల రమణ, శీలం వెంకటరమణ, కోన గోవిందు, సలాది రాజు, కుడుపూడి కొండ, ఈదర కిట్టయ్య, చిలుకూరి తాతారావు, పంచాయతీ సిబ్బంది తాతపూడి వాసు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కష్టంలో కుటుంబానికి చేయూత ఇచ్చిన బుజ్జి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కష్ట కాలంలో ఎవరైనా, ఏ నేతలైనా పలకరించి వెళ్తారు. ఇంకా అయితే ధైర్యం చెప్తారు. మహా ఐతే మీకు మేం అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. ఐతే దీనికి భిన్నంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు, నెల్లిపూడి పార్టీ ఉపాధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి) ఐతే కష్ట కాలంలో తన వంతు ఇతోధిక వస్తు, నగదు రూపేణా ఆర్థిక సాయం అందిస్తారు. ఇదే వరవడిని ఆయన తన జన్మభూమి నెల్లిపూడికి, ఆ పరిసర గ్రామాల్లోనూ గత ఐదేళ్లుగా ఓ సంప్రదాయంగా కొనసాగిస్తూ వస్తున్నారు. నెల్లిపూడిలో కోటిపల్లి సింహాచలం ఇటీవల కాలంలో అనారోగ్యంతో కాలం చేశారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన ఆ ఇంటిని బుజ్జి సోమవారం సందర్శించారు. ఆ కుటుంబంలోని సభ్యులు కోటిపల్లి పెద్దగుర్రయ్య , కోటిపల్లి లవకుష్, కోటిపల్లి మేరీ, రాజేష్, బాలకృష్ణ , విజయ, దుర్గలను బుజ్జి పరామర్శించారు. ఆ కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి స్థానికంగా నేనూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతే కాకుండా తన వంతు ఇతోధిక తక్షణ సహాయంగా కుటుంబ పోషణకు నెలసరి భత్యంగా 50 కేజీల మేలిమి రకం బియ్యం, రూ.3,000 నగదును అందించారు. ఈ కార్యక్రమంలో తలపంటి అప్పారావు (బుజ్జి) వెంట నెల్లిపూడి గ్రామ జనసేన నాయకులు పిర్ల నాగు, పిర్ల నాని, కోటిపల్లి ప్రసాద్, చిట్టుమూరు కామరాజు, కానేటి అభి, వరి అప్పారావు, నొక్కి వీరబాబు, జన సైనికులు ఉన్నారు.

# ఏపీ మోడల్ కళాశాల ప్రవేశాలకు ఆహ్వానం




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరం గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ కళాశాలలో 2026-2027 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ఎంపీసీ, బైపిసి, సిఈసి, ఎంఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న160 సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఏప్రిల్ 30 వరకూ అంతర్జాలంలో దరఖాస్తులను స్వీకరిస్తారు. ఓసి, బిసి, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గాల అభ్యర్థులు రూ. 200 లు, ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాల అభ్యర్థులు రూ. 150 చొప్పున దరఖాస్తు రుసుముగా చెల్లించాలని, పదవ తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగానూ, ఆయా అభ్యర్థుల సామాజిక వర్గాల రిజర్వేషన్ల దామాషా ప్రకారం సీట్లను కేటాయిస్తామని, పూర్తిగా ఆంగ్ల మాధ్యంలోనే విద్యా బోధన జరుగుతుందని, పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఏ.వీరరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఒమ్మంగిలో పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ కలయిక...!

## 25 ఏళ్లకు ఆత్మీయ సమ్మేళనంతో అవధులు లేని ఆనందం

## పాల్గొన్న 40 మంది పూర్వ విద్యార్థులు - విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘన సన్మానం



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** 25 సంవత్సరాల కిందట చదువుకొని వివిధ ప్రాంతాల్లో స్థిరపడి, తాజాగా ఆత్మీయ కలయికగా ఒక చోట చేరి తమ గత ఆపాత మధుర జ్ఞాపకాలను స్మరణకు తెచ్చుకుంటూ నెమరు వేసుకుంటూ ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులతో పులకరించి పోతూ హాయిగా ఒకరి విషయాలను మరొకరికి పంచుకుంటూ ఈ పూర్వ విద్యార్థులు చదువులమ్మ బడి నీడలో ఒక పరి సేద దీరారు. తమను ప్రయోజకులను చేసిన గురువులను కృతజ్ఞతతో ఘనంగా సన్మానించి వారి పాద పద్మాలకు ప్రణమిల్లి నమోవాకాలు తెలిపారు. ఈ ఆత్మీయ కలయికగా తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పూర్వ విద్యార్థులు, గురువులూ ఇరు పక్షాలూ ఎంతో సగర్వంగా చెప్పుకున్న అరుదైన ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ సరస్వతీ నిలయంలో 2000 -2001 సంవత్సరాల కాలంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ మా వద్ద విద్యను అభ్యసించి వివిధ హోదాల్లో, వ్యాపార సంస్థల్లో ఉంటూ ఒక అమూల్యమైన రోజుగా ఈ అపూర్వ విద్యార్థుల కలయిక సమ్మేళనం అనేది మా జీవితంలో మరిచి పోలేని రోజని తెలిపారు. అనంతరం పాత రోజుల్లో విద్యార్థులతో ఉన్న తీరును వారు గుర్తు తెచ్చుకొని, తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తదుపరి పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము నేర్చుకున్న ఈ పాఠశాల మాకు ఒక మంచి మార్గదర్శకం అయిందని, మా గురువుల విద్య బోధన, ఆశీస్సులతో మా జీవితాలు సుఖవంతంగా ఉండటం మా పూర్వజన్మ సుకృతమని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆ కాలంలో గురువుల వద్ద విద్యార్థులు చేసిన తీపి గుర్తులను వారు గుర్తు తెచ్చుకొని తమ ఆనందాన్ని ఈ వేదిక ద్వారా అందరికీ అందించిన వైనం విశేషంగా ఆకట్టుకుందని తెలిపారు. అంతే కాకుండా పాఠశాల ఔన్నత్యాన్ని,పూర్వ విద్యార్థులుగా మమ్ములను ప్రయోజకులుగా తీర్చిదిచ్చిన పాఠశాల ఉపాధ్యాయులకు ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు. తమకు విద్యను అందించిన వేదికైన ఈ పాఠశాల అభివృద్ధిలో భవిష్యత్తులో తాము కూడా భాగస్వాములు అవుతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది పూర్వ విద్యార్థులతో పాటు అప్పటి ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు శివప్రసాద్, పెద్దబ్బాయి, సూర్యారావు, భాష్యం, తేజోమూర్తుల సత్యనారాయణ, అన్నపూర్ణ, శైలజ, విద్యార్థులు గోపు గంగారావు, రామకుర్తి వెంకట్రావు, మొండి లోవప్రసాద్, కొప్పన నందీశ్వరావు (నాని) పెద్దిరెడ్డి దొరబాబు, గాది రామాంజనేయులు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, పసుమర్తి సర్వారావు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా జరిగిన భాను ప్రకాష్ స్కూల్ వారోత్సవాలు





**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామం విద్యా వ్యవస్థలో ప్రాముఖ్యత కలిగిన భాను ప్రకాష్ స్కూల్ వార్షికోత్సవం శనివారం స్కూల్ ఆవరణలో స్కూల్ యాజమాన్యం కె.వి.వి సత్యనారాయణ, బి చందర్రావు, ప్రధాన ఉపాధ్యాయురాలు అయిన కే. సత్యవేణి మరియు ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బోండా వెంకన్న రావు పాల్గొన్నారు. ఈయన మాట్లాడుతూ వేళంగి గ్రామంలో భాను ప్రకాష్ స్కూల్ లాంటి సంస్థ ఉండడం మన గ్రామానికి గర్వ కారణమని ఈ స్కూల్ యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ స్కూలు గొప్పతనం కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూలు విద్యార్థిని విద్యార్థులు డాన్సులతో అలరించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వాళ్ల పిల్లలు వేస్తున్న నృత్యాలు చూసి తల్లిదండ్రులు మురిచిపోయారు. స్కూల్ ఆవరణలో పండగ వాతావరణం నెలకొంది. తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వివిధ ఆటపాటలలో కార్యక్రమాలలో విన్నర్స్ అయినా విద్యార్థులకు గిఫ్ట్ పంపిణీ చేశారు. ఈ వారోత్సవ కార్యక్రమానికి గ్రామ టిడిపి నాయకులు వెలుగుల లచ్చారావు, మేడిశెట్టి పట్టాభి, సానా శ్రీను, ఎర్ర విక్రమ్, కొంతమంది గ్రామస్తులు పాల్గొన్నారు. స్కూల్ యాజమాన్యం వారు మాట్లాడుతూ మా స్కూల్ వారోత్సవం సభ సక్సెస్ అయినందుకు మాకు గర్వంగా ఉందని, మాకు సపోర్ట్ గా నిలిచిన ప్రతి ఉపాధ్యాయులకు,విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు మరి గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.



# “దొమ్మేటి” భవిష్యత్తు తరాలకు ఆదర్శం

**అధికారికంగా జయంతి జరపడాన్ని సాధించుకోగలిగాం – దొమ్మేటి వెంకట రెడ్డి విగ్రహం పెట్టించుకున్నాం**
**అందరం కలసికట్టుగా ముందుకు సాగుదాం - జయంతి కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శెట్టిబలిజ జాతికోసం అహర్నిశలు పాటుపడిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయులని, అందుకే విగ్రహాన్ని పెట్టించడమే కాకుండా, ఆయన జయంతిని అధికారికంగా జరిపించాలన్న కోరిక సాధించుకోగలిగామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, బిసిల పట్ల ప్రేమకు నిదర్శనమని ఆయన అన్నారు. శెట్టిబలిజ ఆశాజ్యోతి స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా లాలా చెరువు సెంటర్లోని వాంబే గృహాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బీసీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వాసు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ వర్గానికి చెందిన వాళ్ళు గత ప్రభుత్వంలో ఉన్నప్పటికీ దొమ్మేటి విగ్రహాన్ని పెట్టించడంలో శీతకన్ను వేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దొమ్మేటి విగ్రహం ఆవిష్కరణ అవసరాన్ని గుర్తించి, శెట్టిబలిజ పెద్దలందరినీ సంప్రదించి, కార్యరూపంలోకి తెచ్చుకోగలిగామని ఆయన అన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా జరిపిస్తామని ఇచ్చిన హామీ నెరవేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే వాసు స్పష్టం చేసారు. తన నియోజకవర్గానికి చెందిన కుడుపూడి సత్తిబాబు శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గా ఉంటూ ఈ డిమాండ్ సాధన కోసం మంత్రి వాసంశెట్టి సుభాష్, పితాని సత్యనారాయణ, రెడ్డి సుబ్రహ్మణ్యం లతో కల్సి మంత్రి లోకేష్ దగ్గరకు వెళ్లి విన్నవించడం, మంత్రి సవిత సహకారం తీసుకుని వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లడం ఆయన ఆమోదించడం జరిగాయని ఆయన వివరించారు. ఇందులో తాను భాగం పంచుకున్నందుకు ఒక బిసి బిడ్డగా సోదర బిసిలకు సహకరికరించే అదృష్టం దక్కిందని ఎమ్మెల్యే వాసు ఆనందం వ్యక్తంచేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్ సవితలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఆయన తెలిపారు. గతంలో ఎందుకు సాధించలేదని తాను అడగడం లేదని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఇప్పుడు సాధించుకొన్నందున అందరం కల్సికట్టుగా ముందుకు వెళదామని, మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధన కోసం పార్టీలకు అతీతంగా అందరం కృషి చేద్దామని అయన పిలుపు నిచ్చారు. రాజకీయాలు ఉంటాయి, పోతాయని, అయితే పుట్టిన జాతి శాశ్వతమని ఆయన అన్నారు. జాతికోసం ఏమి చేశావన్నదే శాశ్వతంగా గుర్తుంచుకుంటారని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. విగ్రహావిష్కరణలో దగ్గర ఉండి చూసుకోవడమే కాకుండా దొమ్మేటి జయంతి అధికారకంగా ప్రకటించి, జరిపించే ప్రక్రియలో కూడా తాను భాగంగా ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు. ఇంతకన్నా ఏంకావాలన్నారు. అందరం కలసికట్టుగా ఈ నగరంలోని మహనీయులను గుర్తించి గౌరవిస్తూ వెళదామని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ

**ప్రవీణ్ మృతిపై క్రైస్తవ లోకంలో ఉన్న అనుమానాలు పోలీసులు నివృత్తి చేయాలి**
**- మీడియా సమావేశంలో మాజీ ఎంపీ హర్షకుమార్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై క్రైస్తవ లోకంలో ఉన్న అనుమానాలను పోలీసులు నివృత్తి చేయాలని మాజీ ఎంపీ హర్ష కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక లూథర్ గిరి మైదానంలో సాయంత్రం 5 గంటలకు పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక రాజీవ్ గాంధీ కళాశాలలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాస్టర్ ప్రవీణ్ పగడాల ది ప్రమాదం కాదని, హత్య అని శరీరంపై ఐదు ఆరు అనుమానస్పద గాయాలు ఉన్నాయని ఆయన అభిమానులు భావిస్తురని అన్నారు. ఫోరెన్సిక్ రిపోర్టు గాని, పోస్టుమార్టం రిపోర్ట్ గాని ఇంతవరకు పోలీసులు బయట పెట్టకపోవడం బట్టి సందేహాలు కలుగుతున్నాయన్నారు. గత సంవత్సరం నుంచి పాస్టర్ ప్రవీణ్ పగడాల సమస్మరణ సభ నిర్వహించాలని అనుకున్నామని ప్రభుత్వం అంగీకరించలేదన్నారు. మంగళవారం నిర్వహించే సభకు క్రైస్తవులు అభిమానులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గన్నవరం నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే స్థానిక దళితులపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని, కుల వివక్షత పాటిస్తున్నారని ప్రజా ప్రతినిధిగా ఇది సరైన విధానం కాదన్నారు. ఆ గ్రామంలో ఒక రోడ్డుపై ఒక వర్గం జరిపే పెళ్లి వేడుకలు జరుగుతుండగా, అదే ఆ రోజుల్లోనే ఒక దళితుడు మృతి చెందడంతో మృతదేహాన్ని తరలించడంలో ఇరు వర్గాలకు వచ్చిన బీదాభిప్రాయాలు కుల వివక్షతకు దారితీసాయని అన్నారు. ప్రజా ప్రతినిధిగా ఇరు వర్గాలను సమన్వయముతో సముద్రయించాల్సిన ఎమ్మెల్యే ఒక వర్గానికి కొమ్ము కాయడం, దళితులకు వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. చివరకు ఇరు వర్గాల మధ్య కొట్లాటకు దారి తీసిందని తాను సంఘటన ప్రాంతానికి తాను వెళ్లి దళితుల పరామర్శించి పోలీసులను ప్రశ్నించగాకేసు నమోదు చేశారని నిందితులను మాత్రం ఇంతవరకు అరెస్టు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు కుల వివక్షత నానాటికి పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు, చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఏప్రిల్ 3న రాకాస చిత్రం విడుదల కుటుంబంతో కలిసి చూడాలి

**హర్రర్ ఫాంటసీ కామెడీ కుటుంబ కథా చిత్రం రాకాస – రాజమండ్రిలో రాకాస చిత్రం హీరో, హీరోయిన్ సందడి**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిహారిక కొణతాల ప్రొడక్షన్ లో హీరో సంగీత్ శోభన్ , హీరోయిన్ నయన సారిక కలిసి నటించిన రాకాస చిత్రం హర్రర్,ఫాంటసీ, కుటుంబ కథా చిత్రమని ప్రొడ్యూసర్ నిహారిక కొణతాల అన్నారు . ఆదివారం రాకాస మూవీ రిలీజ్ ప్రమోషన్లో భాగంగా హీరో , హీరోయిన్, కొణిదల నిహారిక,గెటప్ శ్రీను చిత్ర బృందం రాజమండ్రి షెల్టాన్ హోటల్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు . చిత్రం యూనిట్ సభ్యులతో కలిసి నిహారిక మాట్లాడుతూ కమిటీ కుర్రాళ్ళు కంటే భిన్నంగా రాకాస సినిమా కథ ఉంటుందని అన్నారు. హిరో సంగీత్ శోభన్ , హీరోయిన్ నయన సారిక లు ఈ సినిమాలో కష్టపడి నటించారని వివరించారు. ఏప్రిల్ 3 వ తేదీన విడుదల అవుతుందని తెలిపారు. సంగీతం, డాన్స్,లతో సినిమా ఉత్సాహంగా ఉంటుందని వివరించారు. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని అన్నారు. సినిమా ను కుటుంబంతో కలిసి చూడాలని కోరారు. సినిమా హీరో సంగీత్ శోభన్ మాట్లాడుతూ రాజమండ్రి దేవీ చౌక్ లో అమ్మవారిని దర్శించుకున్నామని తెలిపారు. తన తండ్రి గారిది రాజమండ్రి సమీపంలోని కోరుకొండ గ్రామమని తెలిపారు. రాకాస ఫాంటసీ,థ్రిల్లర్, కామెడీ సినిమా అన్నారు. నటీ నటులు అంతా కష్టపడి పని చేశామని అన్నారు. ప్రేక్షకులు తప్పకుండా ఆదరించాలని పేర్కొన్నారు. హీరోయిన్ నయన సారిక మాట్లాడుతూ రాజమండ్రి చాలాసార్లు వచ్చానని చెప్పారు. ప్రెస్ మీట్ లో కూర్చుని మాట్లాడడం మొదటి సారని అన్నారు. రాకాస సినిమా లో కష్టపడి నటించామని తెలిపారు. ఇది తనకు మూడోవ ప్రాజెక్ట్ అని అన్నారు.ఫన్, థ్రిల్లర్ , సినిమా అని తప్పకుండా ఆదరించాలని పేర్కొన్నారు. గెటప్ శ్రీను మాట్లాడుతూ రాజమండ్రి రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఫాంటసీ,హర్రర్, కామెడీ ,కుటుంబం కథా చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని అన్నారు.

# వేట్లపాలెం అగ్నిప్రమాద బాధితులకు సాధన మహిళా మండలి అండ





**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత నెల ఫిబ్రవరి 28వ తేదీన వేట్లపాలెం గ్రామంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ పేలుడులో ఇప్పటి వరకు 30 మంది అమాయక కూలీలు ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. ఈ విషాదకర ఘటనతో దుర్భర స్థితిలో ఉన్న ఆయా కుటుం బాలను ఆదుక కునేందుకు సాధన మహిళా మండలి (వావీవీ) వేట్లపాలెం గ్రామంలో సహాయ పంపిణీ కార్యక్ర మాన్ని చేపట్టింది. కుటుంబ పోషకులను కోల్పోయి అనాథలైన ఆ 30 కుటుం బాలకు భరోసా కల్పించేం దుకు సాధన మహిళా మండలి ఈ క్రింది వస్తు వులను పంపిణీ చేసింది. ప్రతికుటుంబానికి నాణ్యమైన బియ్యం (26 కె.జి) బస్తాతో పాటు 25 రకాల నిత్యావసర సరుకులు, కిరాణా సామాగ్రితో కూడిన సమగ్ర కిట్, తాజా కూరగాయలు కుటుంబ అవసరాలకు సరిపడా కూరగాయల పంపిణీ.ఈ సందర్భంగా సాధన మహిళా మండలి అధ్యక్షురాలు సుజ్ఞాన కుమారి పసలపూడి మాట్లాడుతూ,ఒక్క క్షణంలో సర్వస్వం కోల్పోయిన ఈ పేద కుటుంబాల పరిస్థితి అత్యంత దయనీయం. వారికి కేవలం వస్తురూపంలోనే కాకుండా, సమాజం మీకు అండగా ఉందనే భరోసా కల్పించడమే మా ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సాధన మహిళా మండలి అధ్యక్షు రాలు పి.సుజ్ఞాన కుమారి, సాధన మహిళా మండలి ముఖ్య సలహాదారు రిటైర్డ్ ఎంపీడీవో పి.వెంకట రత్నం, రాష్ట్ర ఎం.ఈ.ఎఫ్ ఉపాధ్యక్షులు తాతపూడి వెంకటేష్, రాష్ట్ర ఎంఎల్ఎఫ్ అధ్యక్షులు అడ్వకేట్ కొత్తపల్లి ప్రసాద్, రాష్ట్ర ఎంఆర్పిఎస్ నాయ కులు అడ్వకేట్ కొండేపూడి ఉదయ్ కుమార్, జిల్లా ఎంఈఎఫ్ నాయకులు గోరింట అబ్బులు, జిల్లా మరియు స్థానిక నాయకులు వల్లూరి నాని, కొత్త విజయకుమార్, మోరంపూడి సూరిబాబు, రవి కుమార్, వీఆర్వో వల్లూరి దుర్గారావు, పంచాయతీ డెవలప్మెంట్ అధికారి లంక త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# హైటెక్స్ వద్ద హెల్త్‌కేర్ భవిష్యత్తుకు స్పాట్‌లైట్ : మెడికాల్ హైదరాబాద్







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశంలో అతిపెద్ద వైద్య పరికరాల ప్రదర్శనగా పేరుగాంచిన మెడికాల్, తన 46వ ఎడిషన్‌తో మళ్లీ హైదరాబాద్‌కు రానుంది. దేశవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను రెండు దశాబ్దాలుగా అనుసంధానిస్తున్న ఈ ప్రదర్శన, 20 ఏళ్ల ప్రయాణానికి గుర్తుగా నిలుస్తోంది. 2026 ఏప్రిల్ 4, 5 మరియు 6 తేదీల్లో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించబడనున్న మెడికాల్ హైదరాబాద్ 2026లో 300కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొననున్నారు. అలాగే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర మరియు పరిసర ప్రాంతాల నుండి 6,000కు పైగా వైద్యులు, ఆసుపత్రి యజమానులు మరియు ఆరోగ్య రంగ నిర్ణయాధికారులు హాజరుకానున్నారని అంచనా. గత కొన్ని సంవత్సరాలుగా, మెడికాల్ ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు తమ సౌకర్యాలను నిర్మించేందుకు, నవీకరించేందుకు మరియు విస్తరించేందుకు విశ్వసనీయ వేదికగా నిలిచింది. హైదరాబాద్ ఎడిషన్ కూడా అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ, ఆసుపత్రి కొనుగోళ్లకు సమగ్ర వేదికగా పనిచేస్తుంది, ఒకే చోట విస్తృత ప్రొడక్టులు మరియు పరిష్కారాలను పరిచయం చేస్తుంది. వైద్య పరికరాలు మరియు ఉపకరణాలు, రోగనిర్ధారణ మరియు ప్రయోగశాల పరిష్కారాలు, ఆసుపత్రి మౌలిక సదుపాయాలు మరియు ఫర్నిచర్, శస్త్రచికిత్సా పరికరాలు మరియు వినియోగ వస్తువులు, అలాగే డిజిటల్ హెల్త్ మరియు హెల్త్‌కేర్ ఏఐ వ్యవస్థలు వంటి విస్తృత సమర్పణలను మెడికాల్ ప్రదర్శిస్తుంది. ఈ ప్రదర్శన ఆసుపత్రులకు, ప్రత్యేకించి చిన్న మరియు మధ్య తరహా సంస్థలకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పోల్చడం, సరఫరాదారులతో చర్చించడం, పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం కోసం విలువైన అవకాశాన్ని అందిస్తుంది. ఈ కార్యక్రమం తయారీదారులు, డీలర్లు మరియు కొనుగోలుదారులకు ఒక కీలక సమావేశ వేదికగా పనిచేస్తూ, ఆరోగ్య సంరక్షణ విలువ గొలుసు అంతటా బలమైన వ్యాపార అవకాశాలను సృష్టిస్తుంది. డీలర్లు కొత్త పంపిణీదారులను అన్వేషించవచ్చు, తయారీదారులు తమ మార్కెట్ ఉనికిని విస్తరించవచ్చు, అలాగే ఆసుపత్రులు నేరుగా పరిష్కార ప్రదాతలతో భాగస్వామ్యం కల్పించుకోవచ్చు. ఈ సంవత్సరం ఎడిషన్‌లో ప్రధాన ఆకర్షణగా ‘మేక్ ఇన్ ఇండియా’ వైద్య సాంకేతికతలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడుతోంది. దేశీయ ఆరోగ్య సంరక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భారతీయ తయారీదారులు అధిక నాణ్యతతో పాటు తక్కువ ఖర్చుతో కూడిన వినూత్న పరిష్కారాలను విస్తృతంగా ప్రదర్శించనున్నారు. ఈ దృష్టికోణం, దేశవ్యాప్తంగా అందుబాటులో ఉండే మరియు అందరికీ చేరువైన ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలపై పెరుగుతున్న అవసరాలకు బలమైన మద్దతును అందిస్తుంది. మెడికాల్ ఫెయిర్‌లో అనుభవజ్ఞులైన పరిశ్రమ నిపుణుల ఆధ్వర్యంలో సెమినార్లు మరియు వర్క్‌షాప్‌ల శ్రేణి కూడా నిర్వహించబడనుంది. ఈ సెషన్లు కొత్త ఆసుపత్రులను ప్రణాళిక చేయాలనుకునే వ్యవస్థాపకులకు మార్గదర్శకత్వం ఇవ్వడం, నిర్వాహకులకు కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడడం, అలాగే ఆరోగ్య సంరక్షణ డెలివరీ మరియు సాంకేతిక పరిజ్ఞానంలో వెలుగులోకి వస్తున్న తాజా ధోరణులను చర్చించడం కోసం రూపొందించబడ్డాయి. ఆరోగ్య సంరక్షణ సంస్థల్లో నేరుగా అమలు చేయగల ఆచరణాత్మక అవగాహనలను అందించడం ఈ సెషన్ల ప్రధాన లక్ష్యం. హైదరాబాద్ నగరం క్రమంగా ఔషధాలు, వైద్య పరికరాలు మరియు ఆరోగ్య సేవల కోసం ప్రముఖ కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో మెడికల్ ఫెయిర్ ఉనికి, రంగంలోని వివిధ వాటాదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా, వ్యాపార మార్పిడి మరియు జ్ఞాన భాగస్వామ్యాన్ని సులభతరం చేస్తూ, ఈ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

# శ్రీశ్రీశ్రీ మావుళ్ళమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి పెందుర్తి అభిరామ్ విరాళం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరంలోని గ్రామదేవత శ్రీశ్రీశ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ విరాళం అందజేశారు. స్వర్గీయ డాక్టర్ పెందుర్తి రామచంద్రరావు జ్ఞాపకార్థం, పెందుర్తి సేవా సమితి తరపున రూ. 1,10,000 (లక్షా పదివేల రూపాయలు) నగదును ఆలయ కమిటీ సభ్యులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు. తమ తాతగారి ఆశయాలకు అనుగుణంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని, మెడికల్ క్యాంపులు, జాబ్ మేళాలు నిర్వహిస్తామని, స్థానిక నాయకులతో చర్చించి కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా అభిరామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు మధురపూడి, గాడాల, నిడిగట్లలో విద్యుత్‌కు అంతరాయం : నటరాజన్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నేడు కోరుకొండ మండలంలోని 33/11 కెవి గాడాల సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి గాడాల - మధురపూడి, 11 కేవీ ఎయిర్ పోర్టు,11 కేవీ గాడాల,11 కేవీ నిడిగట్ల ఫీడర్లు, సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతులు నిమిత్తం ఈ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ తెలిపారు. మంగళవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. మధురపూడి, గాడాల, నిడిగట్ల గ్రామ ప్రజలు సహకరించవలసినదిగా కోరారు. అదేవిధంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 4గంటల నుండి 8గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు విద్యుత్తు ఇవ్వబడుతుందన్నారు. రైతులు గమనించి సహకరించాలన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో భారతి




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయము వద్ద ఎంపీడీవో ఎం భారతి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో భారతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఓ సుబ్రహ్మ ణ్యం,ఈఓపిఆర్డి మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

### దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా

# ఘన నివాళులు

**పూలమాలలు వేసి స్మరించుకున్న జిల్లా అధ్యక్షులు చిర్ల**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటరెడ్డి సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజల కోసం పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు.



సినీ వాయిస్ CINEMA

# గుండె ధైర్యముంటేనే చూడండి..

## ఓటీటీలో ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్.. తెలుగులోనూ స్ట్రీమింగ్



మీకు క్రైమ్ థ్రిల్లర్ సినిమాలు, వెబ్ సిరీస్ లంటే ఇష్టమా? ఓటీటీలో ఓ మంచి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ లేదా వెబ్ సిరీస్ చూడాలనుకుంటున్నారా? అయితే మీకు ఈ వెబ్ సిరీస్ మంచి ఆప్షన్ అనుకోవచ్చు. ఆద్యంతం ఉత్కంఠ రేపే ఈ సిరీస్ కు ఐఎమ్ డీబీలోనూ టాప్ రేటింగ్ ఉంది. ప్రస్తుతం ఓటీటీలో సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ సినిమాలదే హవా. భాషతో సంబంధం లేకుండా ఈ జానర్ సినిమాలు, సిరీస్ లను చూసేస్తున్నారు ఆడియెన్స్. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగానే ఓటీటీ సంస్థలు కూడా ఇంట్రెస్టింగ్ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలు, వెబ్ సిరీస్ లను ఆయా భాషల్లోకి అనువాదం చేసి మరీ స్ట్రీమింగ్ కు తీసుకొస్తున్నాయి. అలా కొన్ని రోజుల క్రితం ఓటీటీలోకి వచ్చిన ఓ వెబ్ సిరీస్ టాప్ ట్రెండింగ్ లో కొనసాగుతోంది. సాధారణంగా ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్ల మూవీస్, వెబ్ సిరీస్ లలో కిల్లర్ లేదా క్రిమినల్ ఎవరన్నది చివరి దాకా రివీల్ చేయరు. కానీ ఈ సిరీస్ లో మాత్రం రెండో ఎపిసోడ్ లోనే సీరియల్ కిల్లర్ ను రివీల్ చేస్తారు. అతను హత్యలు ఎలా చేస్తున్నాడో చూపిస్తారు. అయినా ఈ సిరీస్ ఆసక్తిని కోల్పోదు. ఈ సిరీస్ కథ మొత్తం ఓ సీరియల్ కిల్లర్ కేసు చుట్టూనే తిరుగుతుంది. అతి చిన్న వయస్సులో ముంబై నగరానికి డీసిపి అయిన రీటా ఫెరారియా ఈ కేసును ఒక ఛాలెంజింగ్ గా తీసుకుంటుంది. ఉన్నట్లుండి నగరంలో వరుసగా హత్యలు జరుగుతూ ఉంటాయి. ఆ హత్యలు కూడా ఒకే పంథాలో జరుగుతుంటాయి. ఓ సీరియల్ కిల్లర్ పోలీసులకు ఒక చిన్న క్లూ కూడా వదలకుండా చాలా పకడ్బందీగా ఈ మర్డర్లు చేస్తుంటాడు. అంతేకాదు బాధితులను చంపే ముందు వారిని దారుణంగా హింసిస్తుంటాడు. కానీ పోలీసులు ఈ సైకో కిల్లర్ జాడను మాత్రం కనుక్కోలేకపోతారు. దీంతో ఆ కిల్లర్ మరింత రెచ్చిపోతాడు. చివరకు పోలీస్ స్టాఫ్ లో కూడా ఒకరిని హత్య చేస్తాడు. మరి క్రిమినల్ ను పట్టుకునేందుకు రీటా ఏం చేస్తుంది? అసలు ఆ సైకో కిల్లర్ ఎందుకు ఈ హత్యలు చేస్తున్నాడు? అతని మోటివ్ ఏంటి? చివరకు ఆ సైకో కిల్లర్ పోలీసులకు దొరికాడా? లేదా? అన్నది తెలుసుకోవాలంటే ఈ సిరీస్ చూడాల్సిందే. ఉత్కంఠ భరిత సన్నివేశాలు, ఊహకు అందని ట్విస్టులు, గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లేతో ఆద్యంతం థ్రిల్లింగ్ గా సాగే ఈ క్రైమ్ సిరీస్ పేరు దల్ దల్. అమృత్ రాజ్ గుప్తా తెరకెక్కించిన ఈ సిరీస్ లో బాలీవుడ్ హీరోయిన్ భూమి పడ్నేకర్ ప్రధాన పాత్ర పోషించింది. ప్రస్తుతం ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. హిందీతో పాటు తెలుగు తదితర భాషల్లోనూ ఈ సిరీస్ అందుబాటులో ఉంది. మొత్తం ఏడు భాగాలున్న ఈ వెబ్ సిరీస్ లో హింసాత్మక సన్నివేశాలు చాలా నే ఉన్నాయి. కాబట్టి పిల్లలతో చూడకపోవడమే ఉత్తమం.

# ఆలియా భట్‌పై నెటిజన్ల ఫైర్!

## ఒకవైపు 'వన్యప్రాణుల సంరక్షణ'.. మరోవైపు 'లెదర్ బ్రాండ్' ప్రచారం?



నేటి కాలంలో సెలబ్రిటీలు కేవలం వెండితెరపై మెరిస్తే సరిపోదు, వారు చేసే ప్రచారాలు, వారు పాటించే విలువల మధ్య సమన్వయం ఉండాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ఆలియా భట్ విషయంలో తలెత్తిన ఈ వివాదం 'సెలబ్రిటీ అడ్వకేసీ' మరియు 'బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్' మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఎత్తి చూపుతోంది. గ్లోబల్ ఐకాన్, బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన చర్చకు కేంద్రబిందువుగా మారారు. ప్రపంచ ప్రఖ్యాత 'నేషనల్ జియోగ్రాఫిక్' సంస్థ తన 2026 ఎడిషన్ "33" జాబితాలో ఆలియాను ఒక 'చేంజ్ మేకర్' గా గుర్తించింది. వన్యప్రాణుల సంరక్షణ మరియు పర్యావరణం పట్ల ఆమె చూపిస్తున్న చొరవను అభినందిస్తూ ఈ గౌరవం దక్కింది. అయితే, ఇదే సమయంలో ఆమె లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ 'గుచ్చి'కి గ్లోబల్ అంబాసిడర్‌గా ఉండటం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలకు దారితీసింది. పర్యావరణ హితం కోరే వ్యక్తి, జంతు చర్మంతో వస్తువులను తయారు చేసే బ్రాండ్‌ను ఎలా ప్రోత్సహిస్తారని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

**ఆలియా చొరవ..**

చిన్నతనం నుండే జంతువులంటే ప్రాణమిచ్చే ఆలియా, గత కొన్నేళ్లుగా వన్యప్రాణుల సంరక్షణ కోసం గొంతు విప్పుతున్నారు. జంతు సంరక్షణ కేంద్రాలకు మద్దతు ఇవ్వడం, పిల్లల కోసం 'సస్టైనబుల్' (పర్యావరణ హిత) దుస్తుల బ్రాండ్‌ను ప్రారంభించడం వంటి పనులు ఆమెకు ఈ గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ఒక నటిగా తనకున్న ప్రభావాన్ని సామాజిక మార్పు కోసం వాడుతున్నారని పేర్కొంది.

**విమర్శలకు దారితీసిన 'లెదర్' దుస్తులు..**

అయితే, ఈ వార్త బయటకు వచ్చిన వెంటనే ఇంటర్నెట్‌లో విమర్శల వర్షం కురిసింది. ఇటీవల మిలాన్ ఫ్యాషన్ వీక్‌లో ఆలియా 'గుచ్చి' బ్రాండ్ కోసం ధరించిన పూర్తి లెదర్ దుస్తుల ఫోటోలను నెటిజన్లు షేర్ చేస్తున్నారు. "నోటితో జంతువులను కాపాడాలని చెబుతూ.. ఒంటిపై జంతు చర్మంతో చేసిన దుస్తులు ధరించడం ఏంటి?" అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. "ఇది నేషనల్ జియోగ్రాఫిక్ జాబితానా లేక వోగ్ (ఎశీస్త్రబవ) మ్యాగజైన్ కవరా?" అని నెటిజన్లు నిలదీస్తున్నారు. ఈ వివాదం ఒక లోతైన ప్రశ్నను తెరపైకి తెచ్చింది. ఒక వ్యక్తి లగ్జరీ ఫ్యాషన్ ఐకాన్‌గా ఉంటూనే, జంతు సంరక్షకురాలిగా కొనసాగగలదా? ప్రస్తుత ఫ్యాషన్ ప్రపంచం పర్యావరణ హితం వైపు మారుతున్నప్పటికీ, లెదర్ అనేది ఇప్పటికీ లగ్జరీ బ్రాండ్లకు ప్రధాన వనరు. ఆలియా వంటి స్టార్స్ ఈ రెండు భిన్నమైన విలువల మధ్య చిక్కుకుపోయారు. కేవలం ప్రకటనల కోసమే కాకుండా, వ్యక్తిగత జీవితంలోనూ ఆ విలువలను పాటిస్తేనే గుర్తింపు దక్కుతుందని నెటిజన్ల వాదన. 2026లో ప్రేక్షకులు సెలబ్రిటీల నుండి కేవలం గ్లామర్ మాత్రమే కాదు, 'నిలకడైన నిజాయితీ'ని కోరుకుంటున్నారు. ఆలియా భట్ తన ప్లాట్‌ఫారమ్‌ను మంచి పనుల కోసం వాడుతున్న మాట వాస్తవమే అయినా, ఆమె ధరించే దుస్తులు మరియు చేసే ప్రచారాల విషయంలో మరింత స్పష్టత ఉండాలని ఈ వివాదం స్పష్టం చేస్తోంది.

# మార్చి 28 నుంచి ఐపీఎల్ జాతర..

## వరల్డ్ కప్ గెలిచిన మనోళ్లు ఎవరెవరు ఏ జట్లలో ఉన్నారో తెలుసా ?

క్రీడా వాయిస్



మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత ఆటగాళ్లందరూ ఏయే జట్ల తరపున ఆడుతున్నారో, సంజూ శాంసన్ టీమ్ ఎందుకు మారిందో తెలుసుకుందాం. టీమిండియాను ప్రపంచ విజేతగా నిలిపిన 15 మంది ఆటగాళ్లలో దాదాపు అందరూ తమ పాత జట్లకే పరిమితమయ్యారు. మార్చి 8వ తేదీన టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ పోరులో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి భారత్ మరోసారి విశ్వవిజేతగా నిలిచింది. ఆ విజయోత్సాహం ఇంకా తగ్గకముందే, సరిగ్గా మూడు వారాల వ్యవధిలోనే మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 (ఖూా 2026) సందడి మొదలుకాబోతోంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ఎ) జట్ల మధ్య తొలి పోరు జరగనుంది. అయితే, భారత్‌ను ఛాంపియన్‌గా నిలిపిన మన ప్రపంచ విజేతలు ఈసారి ఐపీఎల్‌లో ఏ జట్టు తరపున ఆడుతున్నారు? వారిలో ఎవరి జట్లు మారాయి? అన్న ఆసక్తికర వివరాలు తెలుసుకుందాం.

**వరల్డ్ కప్ హీరోలు.. ఎవరెక్కడ?**

భారత జట్టును ప్రపంచ విజేతగా నిలిపిన 15 మంది ఆటగాళ్లలో దాదాపు అందరూ తమ పాత జట్లకే పరిమితమయ్యారు. ముంబై ఇండియన్స్ తరపున సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, జస్ప్రీత్ బుమ్రా తమ సత్తా చాటనున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఈసారి సంజూ శాంసన్‌తో పాటు శివం దూబే కనిపిస్తారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికి వస్తే అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఆ జట్టుకు ప్రధాన బలంగా మారనున్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగుతుండగా, గుజరాత్ టైటాన్స్ జట్టులో వాషింగ్టన్ సుందర్, మొహమ్మద్ సిరాజ్ ఉన్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ తరపున కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తమ స్పిన్ మ్యాజిక్ చూపించనుండగా, పంజాబ్ కింగ్స్ జట్టులో అర్ష్‌దీప్ సింగ్ ఏకైక వరల్డ్ కప్ విజేతగా నిలిచారు.

**సంజూ శాంసన్ ఒక్కడే మారాడు**

వరల్డ్ కప్ స్క్వాడ్‌లో ఉన్న 15 మందిలో 14 మంది తమ పాత టీమ్స్‌లోనే ఉండగా, కేవలం సంజూ శాంసన్ మాత్రమే తన జట్టును మార్చుకున్నారు. రాజస్థాన్ రాయల్స్‌ను వదిలి చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడం ఈ సీజన్ లోనే పెద్ద సెన్సేషన్. ఒక భారీ ట్రేడ్ డీల్‌లో భాగంగా సంజూ చెన్నైకి వెళ్లగా, ఆయన స్థానంలో రవీంద్ర జడేజా, సామ్ కరన్ రాజస్థాన్ రాయల్స్ జట్టులోకి వచ్చారు. ధోనీ వారసుడిగా సంజూ చెన్నై పగ్గాలు అందుకుంటాడని ఫ్యాన్స్ ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ మార్పు రాజస్థాన్ జట్టుకు కూడా కొత్త ఈక్వేషన్స్ మోసుకొచ్చింది.

**కెప్టెన్లుగా ముగ్గురు ఛాంపియన్లు**

వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో ఉన్న హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, ఇషాన్ కిషన్ ఈసారి ఐపీఎల్‌లో కెప్టెన్లుగా కనిపిస్తారు. హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్‌ను నడిపిస్తుండగా, అక్షర్ పటేల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు సారథ్యం వహిస్తున్నారు. ఇక ఇషాన్ కిషన్ విషయానికొస్తే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ గాయం కారణంగా తొలి కొన్ని మ్యాచ్‌లకు దూరం కావడంతో, తాత్కాలిక కెప్టెన్‌గా ఇషాన్ బాధ్యతలు చేపట్టనున్నారు. ముగ్గురు ప్రపంచ విజేతలు సారథులుగా వ్యవహరించడం ఈ సీజన్ కు మరింత వన్నె తెచ్చింది.

**ఆరంభ పోరులో ముఖాముఖి**

ఐపీఎల్ 2026 తొలి మ్యాచ్‌లోనే ఇద్దరు వరల్డ్ కప్ హీరోలు తలపడబోతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ మైదానంలోకి దిగనున్నారు. మరోవైపు ఆర్సీబీ తరపున విరాట్ కోహ్లీ (వరల్డ్ కప్ 2026 జట్టులో లేనప్పటికీ) కూడా మైదానంలో ఉండటంతో తొలి రోజే ఫ్యాన్స్‌కు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఖాయం. ప్రపంచ ఛాంపియన్ల మధ్య జరిగే ఈ లీగ్ పోరుపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# పాక్ సూపర్ లీగ్‌కు ఉగ్ర ముప్పు..

## విదేశీ ప్లేయర్లు తప్పుకోవాలని టీటీపీ వార్నింగ్



పాకిస్థాన్ సూపర్ లీగ్ 11పై తాలిబన్ల ముప్పు పొంచి ఉంది. విదేశీ ఆటగాళ్లు తప్పుకోవాలని టీటీపీ హెచ్చరించడంతో ఇప్పటికే పాక్ చేరుకున్న అంతర్జాతీయ క్రికెటర్లలో భయాందోళనలు మొదలయ్యాయి. ప్రేక్షకులు లేకుండానే మ్యాచ్‌లు నిర్వహించాలని పీసీబీ నిర్ణయించింది. పాకిస్థాన్ సూపర్ లీగ్ 11వ సీజన్‌పై ఉగ్రవాద నీడలు కమ్ముకున్నాయి. మార్చి 26 నుంచి టోర్నీ ప్రారంభం కావాల్సి ఉండగా, అంతలోనే నిషేధిత ఉగ్రవాద సంస్థ తహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్‌కి చెందిన జమాత్-ఉల్-అహ్రార్ గ్రూప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. విదేశీ ఆటగాళ్లు వెంటనే ఈ టోర్నీ నుంచి తప్పుకోవాలని, లేదంటే వారి భద్రతకు తాము బాధ్యులం కాదంటూ చిల్లింగ్ అల్టిమేటం ఇచ్చింది. దీంతో ఇప్పటికే పాక్ చేరుకున్న అంతర్జాతీయ క్రికెటర్లలో భయాందోళనలు మొదలయ్యాయి. తహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ ప్రతినిధి అసద్ మన్సూర్ సోషల్ మీడియా వేదికగా ఒక ఆడియో మెసేజ్ రిలీజ్ చేశారు. "పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్ఖ్వా, బలూచిస్థాన్ ప్రాంతాల్లో ప్రజలు ఆర్మీ అణచివేతతో అల్లాడుతుంటే, ఇక్కడ పీఎస్ఎల్ పేరిట వేడుకలు జరపడం వారి గాయాలపై కారం చల్లడమే" అని పేర్కొన్నారు. ముఖ్యంగా స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, గ్లెన్ మాక్స్‌వెల్ వంటి విదేశీ ఆటగాళ్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. "తమ సొంత భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే టోర్నీ నుంచి తప్పుకోవాలని, లేనిపక్షంలో జరిగే పరిణామాలకు మేము బాధ్యులం కాము" అని హెచ్చరించారు. ఈ మేరకు క్రికెట్ బోర్డులకు కూడా సమాచారం పంపినట్లు తెలుస్తోంది. ఒకవైపు ఉగ్రవాద ముప్పు, మరోవైపు దేశంలో తీవ్రమైన ఇంధన సంక్షోభం పాక్ క్రికెట్ బోర్డును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఆదివారం మాట్లాడుతూ.. ఈసారి పీఎస్ఎల్ మ్యాచ్‌లకు ప్రేక్షకులను అనుమతించడం లేదని సంచలన ప్రకటన చేశారు. పశ్చిమ ఆసియాలో (ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా) ఉద్రిక్తతల వల్ల చమురు సరఫరా ఆగిపోవడం, పాకిస్థాన్‌లో పెట్రోల్ కొరత ఏర్పడటంతో ప్రజలు కదలికలను తగ్గించుకోవాలని ప్రభుత్వం కోరింది. అందుకే స్టేడియాలకు 30 వేల మంది రావడం వల్ల వనరులు వృథా అవుతాయని భావించి క్లోజ్డ్ డోర్స్ విధానంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. తొలుత ఆరు నగరాల్లో పీఎస్ఎల్ నిర్వహించాలని భావించినప్పటికీ, ప్రస్తుత భద్రతా పరిస్థితుల దృష్ట్యా కేవలం కరాచీ, లాహోర్‌లలోని రెడ్ జోన్ ప్రాంతాలకే మ్యాచ్‌లను పరిమితం చేశారు. లాహోర్‌లో ఘనంగా జరగాల్సిన ఓపెనింగ్ సెర్మనీని కూడా రద్దు చేశారు. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల నుంచి నిరంతరం దాడులు జరుగుతుండటం, ఇంధన కొరతతో రవాణా ఇబ్బందులు కలగడం పీసీబీకి పెద్ద తలనొప్పిగా మారింది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ వంటి దేశాల ఆటగాళ్లు ఇప్పటికే పాక్ చేరుకున్న తరుణంలో, టీటీపీ హెచ్చరికల నేపథ్యంలో ఆయా దేశాల క్రికెట్ బోర్డులు తమ ప్లేయర్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పాకిస్థాన్‌లో ఇలాంటి అస్థిర పరిస్థితులు ఉండటంతో, ఇప్పటికే కొందరు విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్ ఒప్పందాలను రద్దు చేసుకుని మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్‌లో రిప్లేస్‌మెంట్ ప్లేయర్లుగా చేరడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఒకవేళ విదేశీ ప్లేయర్లు భారీగా నిష్క్రమిస్తే పీఎస్ఎల్ 11 సీజన్ మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com